
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
సోమవారం 22 ఏప్రిల్ 2024



కడియం శ్రీహరిని కొనే దమ్ము ఎవరికీ లేదు!

ఏ రకమైన అవినీతి మరక లేదు.. భూకబ్జాలు, కాంట్రాక్టులు లేవు

- కేసీఆర్‌కు భక్తి ఎక్కువ.. కావ్యకు పార్టీ ఫండ్ ఇచ్చినట్లు ప్రమాణం చేస్తారా
- నా వ్యక్తిత్వాన్ని డ్యామేజ్ చేసేందుకు తప్పుడు ప్రచారం
- నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం
- కడియం కావ్యది షెడ్యూల్ కులం.. హిందూ మహిళే
- బీఆర్ఎస్‌కే కాదు ఎవరికీ ఎప్పుడూ ద్రోహం చేయలేదు.. చేయను కూడా
- వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ బలంగా ఉంది.. కావ్య గెలుపు పక్కా
- ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి

7

"కడియం శ్రీహరి ఎన్నడు కూడా డబ్బులకు అమ్ముడు పోయే వ్యక్తి కాదు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏ ఒక్క అవినీతి మరకలేదు.. భూ కబ్జాలకు పాల్పడలేదు.. దందాలు చేయలేదు.. నా వ్యక్తిగతాన్ని డ్యామేజ్ చేసేందుకు ఇలాంటి ప్రచారం చేస్తున్నారు.. నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం" అని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బీఆర్ఎస్‌కు ఎవరూ లేకపోవటం వల్లే కావ్యకు టికెట్ ఇచ్చారని, పార్టీ ఫండ్ తీసుకున్నట్లు సాక్ష్యాలతో నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని అన్నారు. కావ్య కులాన్ని, మతాన్ని వివాదం చేయటం తదితర అంశాలపై 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో కడియం ప్రస్తావించారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)



గంజాయ్!

ఎన్నికల వేళ యువతకు మత్తెక్కిస్తున్న గంజాయి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఓరుగల్లు యువతకు గంజాయి మత్తెక్కిస్తుంది. పల్లె, పట్నం తేడా లేకుండా విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు సాగుతున్నాయి. యువత, విద్యార్థులే లక్ష్యంగా సరఫరా చేస్తున్నారు. కాలేజీ క్యాంపస్‌లు, విద్యా కూడళ్లతో పాటు జిల్లా కేంద్రాలు, మునిసిపాలిటీలు, కోల్‌బెల్ట్ ఏరియా, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లోని యువత టార్గెట్‌గా గంజాయి విక్రయాలు సాగుతున్నాయి. గంజాయి మత్తుకు బానిసగా మారి అనేక మంది యువకుల జీవితాలు దారి తప్పుతుండగా, ఈ అక్రమ వ్యాపారం చేసే ముఠా మాత్రం కోట్లకు పడగలెత్తుతోంది. అక్కడక్కడ మత్తులో తూలుతున్న యువతను అదుపులోకి తీసుకుని, కేసుల నమోదుతో చేతులు దులుపుకోవడమే డ్యూటీగా కొంత మంది పోలీసులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు గంజాయి సరఫరా చేస్తున్నది ఎవరు..? ఎక్కడి నుంచి గంజాయి వస్తున్నది.. దీని వెనుక ఉన్న పెద్ద మనుషులు ఎవరనే కోణంలో విచారణ జరగటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే...

యువత, విద్యార్థులే టార్గెట్...

గంజాయి అమ్మకాలకు ఓరుగల్లు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. హైదరాబాద్‌లో నిఘా పెరిగిపోవటంతో పాటు ఎస్‌వోటీ, టాస్క్‌ఫోర్సు ప్రత్యేక విభాగాల పోలీసులు ఎప్పటికప్పుడు మత్తు ముఠాల ఆట కట్టిస్తున్నా రు. దీంతో స్మగ్లర్ల కన్ను ఓరుగల్లుపై పడింది. ఎన్నికల సమయం కావటంతో యువత, విద్యార్థులు లక్ష్యంగా విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలకు తెర తీశారు. ఏపీ, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాల నుంచి రైళ్ల ద్వారా గంజాయి ఓరుగల్లుకు చేరవేస్తున్నారు. వరంగల్ నగరంలోని పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీ క్యాపస్‌ల సమీపంలో గంజాయి స్మగ్లింగ్ ముఠాలు ఏజెంట్‌లను ఏర్పాటు చేసుకుని విద్యార్థులకు మత్తు అలవాటు చేస్తున్నారు. గంజాయి అమ్మకాల కోసం ఆయా ఏరియాల్లో ఏజెం ట్లు యువతను బుట్టలో వేసుకుని మత్తులోకి దించుతున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి. రైల్వే లైన్లు ఉన్న వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో విచ్చలవిడిగా గంజాయి సరఫరా అవుతున్నట్లుగా పోలీసు వర్గాలు కూడా అంచనా వేస్తున్నాయి. సరిహద్దులో ఉన్న కోల్‌బెల్ట్ ప్రాంతం భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో కూడా మత్తు యువతను చిత్తు చేస్తుంది. వేసవికాలం కావడంతో నగరంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పిల్లలకు పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఉండటంతో ఇంటి వద్దే ఉంటుండడంతో మత్తుకు మరింత చేరువవుతున్నారనే ప్రచారం జరుగుతోంది. చిన్న ప్యాకెట్ల ద్వారా గంజాయిని సరఫరా చేస్తున్నట్లు సమాచారం. పొడి చేసిన గంజాయిని ఐదు గ్రాముల నుంచి 50 గ్రాముల వరకు విడివిడిగా ప్యాకెట్లు తయారు చేసి విక్రయిస్తున్నారు. గ్రాముకు రూ.50 నుంచి రూ.80ల వరకు నాణ్యతను బట్టి విక్రయిస్తున్నట్లుగా సమాచారం. పొడి గంజాయి కావటంతో చాలా మంది సిగరేట్లలో కలిపి పొగతో పీల్చుతూ మత్తులో తూగుతున్నారు. మరికొంత మంది గంజాయి పొడిని పాలల్లో కలుపుకుని తాగుతున్నట్లుగా తెలుస్తుంది. పాలల్లో టీ పొడి తరహాలో గంజాయి పొడి కలుపుకుని

మిగతా 8వ పేజీలో..

సరఫరా చేస్తున్నది ఎవరు..?

వరంగల్ నగరంతో పాటు ఇతర ప్రాంతాల్లో భారీ ఎత్తున గంజాయి ఎక్కడి నుంచి వస్తుందనే చర్చ జరుగుతోంది. ఒడిశా, ఏపీ, పశ్చిమ బెంగాల్‌తో పాటు సరిహద్దులో ఉన్న ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల నుంచి గంజాయి ఓరుగల్లుకు దిగుమతి అవుతుందని ప్రచారం జరుగుతోంది. అయితే ఓరుగల్లులో గంజాయి వ్యాపారానికి డాన్ ఎవరు అనేది చర్చనీయాంశంగా మారింది. ఎవరి కనుసన్నల్లో గంజాయి రైళ్ల ద్వారా నగరానికి చేరుకుని, అక్కడి నుంచి ఏజెంట్ల ద్వారా విద్యార్థులు, యువత ఉన్న ప్రాంతాల్లోకి చేరుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ముందుగా పెట్టుబడి పెట్టి.. ఆ తరువాత లాభాలు అర్జిస్తున్నది ఎవరు..? వీరికి పోలీసుల నుంచి ఉన్న సహకారం ఎంత అనే చర్చ జరుగుతోంది. విచ్చలవిడిగా గంజాయి లభిస్తుంటే, సూత్రదారులను కనిపెట్టి బొక్కలో వేయకుండా ఖాకీలు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నాయనే విమర్శలొస్తున్నాయి. ఎన్నికల సమయం కావడంతో గంజాయి సరఫరాపై పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్, స్పెషల్ బ్రాంచి పోలీసులు ప్రత్యేకంగా దృష్టి పెట్టి గంజాయిని అరికట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

- సిగరెట్‌లు, ప్యాకెట్లలో రహస్యంగా రవాణా
- యువత, విద్యార్థులే లక్ష్యంగా అమ్మకాలు
- గ్రాముకు రూ.50 నుంచి 80 వరకు విక్రయాలు
- దాడులతో చేతులు దులుపుకుంటున్న అధికారులు
- మత్తులో దారి తప్పుతున్న యువతరం

మచ్చుకు కొన్ని సంఘటనలు..

- ఏప్రిల్ 20వ తేదీన హనుమకొండలోని పద్మాక్షి ఆలయం సమీపంలో శ్మశానవాటిక పరిసరాల్లో గంజాయిని సేవిస్తూ నలుగురు యువకులు హనుమకొండ పోలీసులకు పట్టుబడ్డారు.
- ఏప్రిల్ 16వ తేదీన హనుమకొండ జిల్లా దామెర మండలం ల్యాదెళ్ల వద్ద ముగ్గురు యువకులు గంజాయి సేవిస్తుండగా దామెర పోలీసులు పట్టుకున్నారు. 140 గ్రాముల గంజాయితో పాటు వరంగల్ నగరానికి చెందిన ముగ్గురు యువకులను అరెస్టు చేశారు.
- ఏప్రిల్ 7వ తేదీన వరంగల్ ఇస్లామియా కాలేజీ గ్రౌండ్‌లో ఇద్దరు యువకులు సిగరేట్‌లో గంజాయిని సేవిస్తుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు.
- ఏప్రిల్ 4న హనుమకొండలోని కుమార్‌పల్లి, డబ్బాల వద్ద మత్తులో తూలుతున్న కొంత మంది యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని వదిలేశారు.
- భూపాలపల్లి జిల్లా కాటారం మండలం బయ్యారం క్రాస్ వద్ద ఏప్రిల్ 2వ తేదీన నలుగురు యువకులు గంజాయి గ్రామాలకు సరఫరా చేస్తూ కాటారం పోలీసులకు పట్టుబడ్డారు.

నేటి ప్రజావాణి రద్దు

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 21: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ పార్లమెంట్ నామినేషన్ల స్వీకరణ కొనసాగుతున్న దృష్ట్యా ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ సమస్యలపై కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ సూచించారు.

రైతులు అధైర్య పడొద్దు

రైతులు ఎవరూ అధైర్య పడొద్దని, ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని కలెక్టర్ ప్రావీణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో అకాల వర్షాలు పడుతున్నాయని, అన్ని కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. శనివారం కురిసిన వర్షానికి ధాన్యం ఎక్కువగా తడవలేదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏదైనా సమస్య ఉంటే రైతులు కంట్రోల్ రూమ్ నెంబర్ 79950 50785కు సమాచారం అందించాలని కోరారు.

నేటి బల్దియా గ్రీవెన్స్ రద్దు..

వరంగల్ కార్పొరేషన్: నగర ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ప్రతీ సోమవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఎన్నికలయ్యే వరకు రద్దు చేస్తున్నట్టు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో నిమగ్నం కావడం వల్ల ప్రజావాణి రద్దు చేస్తున్నట్టు వెల్లడించారు. ప్రజలు గమనించి ఫిర్యాదులు సమర్పించేందుకు కార్పొరేషన్‌కు రావద్దని, ఎన్నికల అనంతరం యథావిధిగా కొనసాగుతుందని ఆమె తెలిపారు.

ఆదివారం ఉష్ణోగ్రత	గరిష్ఠం : 39.0°C	కనిష్ఠం : 25.0°C



భయం లేదు.. బయోమెట్రిక్ లేదు..

- సమయానికి రాని సిబ్బంది..
- డ్యూటీకి రాకున్నా రిజిస్టర్‌లో ఇష్టారాజ్యంగా సంతకాలు
- ఫాలోఅప్‌లో నిర్లక్ష్యం
- సీకేఎం ప్రభుత్వ ఆసుపత్రిలో కొరవడిన పర్యవేక్షణ

గిర్మాజిపేట, ఏప్రిల్ 21 : వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటుగా ఇతర ప్రాంతాల మహిళలు ప్రసవం కోసం పెద్ద సంఖ్యలో వస్తుంటారు. అయితే ఆసుపత్రిలోని వైద్యులు, సిబ్బంది సకాలంలో డ్యూటీకి రాక పోవడంతోపాటుగా చికిత్సను పాలోఅప్ చేయకపోతుండటంతో సరైన వైద్య సేవలు అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బయెమెట్రిక్ లేకపోవడం, సూపరింటిండెంట్, ఆర్ఎంఓ పర్యవేక్షణ లోపించడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ప్రచారంసాగుతోంది. నిత్య 200 ఇన్‌పేషంట్లు, 500 మంది అవుట్‌పేషంట్ చికిత్స పొందుతుంటారు. రోజుకు 20 నుంచి 25 ప్రసవాలు, 10 ఆపరేషన్లు, సుమారు 200 స్కానింగ్‌లు, టీఎస్ హెల్త్ హబ్ సహకారంతో 200కు పైగా వివిధ రకాల వైద్య పరీక్షలు జరుగుతుంటాయి. ఆసుపత్రిలో వైద్యకళాశాల ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్లు, పీజీవైద్యులతో పాటుగా పలువురు వైద్యులు పనిచేస్తుంటారు. అధ్యాపక వైద్యులు ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు తప్పనిసరిగా పనిచేయాలి. నర్సింగ్, పారా మెడికల్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది షిఫ్టుల వారిగా పనిచేస్తున్నారు. కార్యాలయం పనివేళలు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. వైద్యులు, సిబ్బంది డ్యూటీకి వచ్చినపుడు అటెండెన్స్ రిజిస్ట్రర్‌లో సంతకాలు చేస్తారు. ఈ అటెండెన్స్ రిజిస్ట్రర్‌లను సూపరింటిండెంట్, ఆర్ఎంఓ ప్రతి రోజు ఉదయం 11 గంటల లోపు పరిశీలించి అప్పటి వరకు రానివారికి అబ్సెంట్ వేస్తారు. వచ్చిన రోజుల మేరకు వేతనాల బిల్లు చెల్లించి ట్రెజరీకి పంపితే జీతాలు వస్తాయి.

లోపించిన పర్యవేక్షణ..

అటెండెన్స్ రిజిస్టర్‌లను సూపరింటిండెంట్, ఆర్ఎంఓలు పట్టించుకోకపోవడంతో వైద్యులు,సిబ్బంది డ్యూటీకి రాని రోజులకు కూడా రిజిస్ట్రర్‌లో సంతకాలు చేస్తున్నారనే ఆరోపనలున్నాయి. బయోమెట్రిక్ అటెండెన్స్ ఆధారంగానే జీతాలు చెల్లించాలని ప్రభుత్వం స్పష్టంగా చెప్పటంతో రెండేళ్ల క్రితం ఆసుపత్రిలో యంత్రాన్ని ఏర్పాటు చేశారు. తర్వాత బయెమెట్రిక్ మిషన్‌ను పాడైందనే సాకుతో తిరిగి అటెండెన్స్ రిజిస్ట్రర్‌లను అమలు చేస్తున్నారు దీంతో ప్రయివేట్ ఆసుపత్రులు నిర్వహిస్తున్న వైద్యులు అటెండెన్స్ రిజిస్ట్రర్‌లో సంతకాలు చేసి బయటకు వెళ్లి డ్యూటీ ముగిసే టైమ్‌కు వస్తున్నట్లు తెలిసింది. అలాగే కొందరు వారానికి మూడు రోజులు వచ్చి అన్ని రోజుల సంతకాలు చేస్తున్నారని రోగులు వాపోతున్నారు. నర్సింగ్, ల్యాబ్, ఫార్మసి, నవజాతశిశు వార్డుతో పాటుగా కార్యాలయంలోను డ్యూటి వేళలు సరిగా పాటించడం లేదని తెలిసింది. కార్యాలయంలో ముఖ్య అధికారి, ఒకరిద్దరు జూనియర్ అసిస్టెంట్లు వారికి ఇష్టం ఉన్నప్పుడు అటెండెన్స్ రిజిస్ట్రర్‌లో సంతకాలు చేస్తున్నట్లు తెలిసింది.



ఆసుపత్రిలో అవుట్‌పేషంట్ విభాగంలో రోగులు

కానరాని ఫాలోఅప్ వైద్య చికిత్సలు ...

నిత్యం డ్యూటీల వారీగా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది వార్డులలో రౌండ్స్ చేసి ప్రసవించిన, ఆపరేషన్ అయిన, ఇతరత్రా వైద్య చికిత్సలు పొందుతున్న రోగులను పరిశీలించి వారి బీపీ, వెయిట్, పల్స్ రీడింగ్‌లతో పాటుగా వారి వైద్య చికిత్సను కేసు షీట్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది వార్డులలో రౌండ్స్‌కు వెళ్లకపోవడంతో రోగులకు ఫాలోఅప్ వైద్య చికిత్సలు అందక రోగుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసింది.



మాట్లాడుతున్న డాక్టరు కడియం కావ్య

కార్పొరేట్ సంస్థలకు దేశాన్ని తాకట్టు పెట్టిన మోదీ

- సమన్యాయం జరగాలంటే రాహుల్ ప్రధాని కావాలి
- పార్టీ సోషల్ మీడియా సెల్ కీలక పాత్ర పోషించాలి
- కాంగ్రెస్ సోషల్ మీడియా సెల్ సమావేశంలో లోకసభ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య

7

అమెరికాలో రోడ్డు ప్రమాదం

- బీటెక్ చదువుకోసం అమెరికా వెళ్లిన గౌతమ్



గౌతమ్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 21: స్టేషన్ ఘన్‌పూర్ డివిజన్ పరిధిలోని శివునిపల్లి పట్టణానికి చెందిన యువకుడు పార్శి గౌతమ్ (19) శనివారం అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వ్యాపారి పార్శి కమల్‌కుమార్-పద్మ దంపతుల కుమారుడు గౌతమ్ ఇంటర్ పూర్తి కాగానే బీటెక్ చదివేందుకు ఏడాదిన్నర క్రితం అమెరికాలోని అరిజోనా రాష్ట్రానికి వెళ్లాడు. ప్రస్తుతం బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. అమెరికా కాలమానం ప్రకారం శనివారం వీకెండ్ కావడంతో స్నేహితులతో కలిసి జలపాతం చూసేందుకు వెళ్లాడు. తిరిగి అరిజోనాలో తాను నివాసం ఉంటున్న ఇంటికి వెళుతున్న క్రమంలో వెనుకాల నుంచి వచ్చిన కారు వీరు ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టింది. దీంతో కారు వెనుక సీట్లో కూర్చున్న గౌతమ్‌తో పాటు కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణానికి చెందిన ముక్క నివేష్ అనే విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందారు. అరిజోనా పోలీసులు గౌతమ్ తండ్రి పార్శి కమల్‌కుమార్‌కు సమాచారం అందించారు. కాగా గౌతమ్ మృతదేహం అమెరికా నుంచి శివునిపల్లి పట్టణానికి రావడానికి మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉందని సమాచారం.



భద్రకాళికి ప్రత్యేక పూజలు

- అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు రిజిస్ట్రార్

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 21: చారిత్రక భద్రకాళి అమ్మవారి దేవాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవు రోజు కావడంతో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తుల రాక కొనసాగింది. ఈ సందర్భంగా రాష్ట్ర హైకోర్టు ప్రొటోకాల్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీర్వచనం తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా బండ్ల జాతర

కరీమాబాద్, ఏప్రిల్ 21: రంగశాయిపేట చారిత్రక రామాలయంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం అశ్వవాహన పారువేట సేవ, బండ్ల జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు గ్రామ ప్రజలే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వేడుకల సందర్భంగా ఆలయం వద్ద దుకాణాలు వెలిశాయి. ఆలయ ప్రాంగణంలో ఆర్కెస్ట్రాతో భక్తి గీతాలను ఆలపించడం జరిగింది. దీంతో ఆలయ పరిసర ప్రాంతాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. జై శ్రీరాం, జై హనుమాన్ నినాదాలతో రంగశాయిపేట పురవీధులు మారుమోగాయి. అంతకుముందు ఆలయంలో ప్రధాన పూజారి తిరిముల శ్రీధరాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో పూర్ణాహుతి, సీతారాములకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పులిగిళ్ల వెంకటరామ నరసింహశాస్త్రి, రామకృష్ణ శాస్త్రి గృహాలకు స్వామివారు అలుకకు వెళ్లడం జరిగింది.

ప్రత్యేక ఆకర్షణగా శోభాయాత్ర

పారువేట, బండ్ల జాతర సందర్భంగా ఆలయ స్థల దాత వద్దిరాజు రంగారావు ఇంటినుంచి ప్రత్యేక రథంలో శ్రీరాము డి శోభాయాత్ర ఆలయం నుంచి బయల్దేరింది. భక్తులు, కోలాటాలు ఆడుతూ శోభాయాత్రలో పాల్గొన్నారు. వేడుకల్లో ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ పులిగిళ్ల వెంకటరామ నరసింహశాస్త్రి, ఈవో ఎన్.వెంకట్రావు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు వలుపదాసు కృష్ణ, బొలుగొడ్డు అనిల్, విలాసాగరం శ్రీనివాస్ (చిన్నా), వద్దిరాజు ప్రశాంత్, పాలకుర్తి రవళి సుమన్, సరిత, అనిల్ పాల్గొన్నారు.



అశ్వవాహన, పారువేట సేవ నిర్వహిస్తున్న భక్తులు

కోడ్ వేళ తస్మాత్ జాగ్రత్త

- వాహనాల తనిఖీని అడ్డుకోకూడదు
- రాజకీయ పార్టీలు ఊరేగింపులు, ర్యాలీలు చేసుకోవచ్చు
- రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దు

వరంగల్ సిటీ, ఏప్రిల్ 21 : ఎన్నికల ప్రచారం ఇప్పుడిప్పుడే ఊపందుకుంటుంది. ఇప్పటికే ఎన్నికల నియమావళి(మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్)ను పకడ్బందీగా అమలు చేసేందుకు ఎన్నికల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నియోజకవర్గాల వారీగా ప్రత్యేక బృందాలను నియమించి వాహన తనిఖీలు చేస్తున్నారు. ప్రచార కార్యక్రమాలు, సభలు, సమావేశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. బ్యాంకుల లావాదేవీలపై నిఘా పెడుతున్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు సైతం నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

వాహనాల తనిఖీని అడ్డుకోకూడదు..

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న క్రమంలో అధికారులు విస్తృతంగా తనిఖీలు చేస్తుంటారు. వాహనాలను ఆపి పూర్తిగా పరిశీలిస్తారు. దీనిని అడ్డుకునే అధికారం ఎవరికీ లేదు. వాహనాల్లో నిషేధిత వస్తువులు ఉంటే వాటిని స్వాధీనం చేసుకుంటారు. పరిమితికి మించి డబ్బులు ఉంటే లెక్కలు,ఆధారాలు చూపాలని, మద్యం ఉంటే వాహనంతో సీజ్ చేస్తారు. సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తారు.

చేయకూడనివి..

- రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించరాదు.
- పోలింగ్ రోజున ఓటర్ల రవాణాకు వాహనాలు ఉపయోగించకూడదు.
- అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించరాదు.
- ఎన్నికల ఫలితాలపై సర్వేలు, ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం.
- ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకూడదు.
- పోలింగ్ కేంద్రాల్లోకి అక్రమంగా చొరబడడం, ఈవీఎం, ఇతర దస్త్రాలను తొలగించడం నేరం
- తప్పుడు ప్రకటనలు, పేయిడ్ న్యూస్‌కు అనుమతి లేదు. తాత్కాలిక, శాశ్వత ఉద్యోగుల నియమాకాలు చేయరాదు.
- కోడ్ అమలులో ఉన్నప్పుడు ప్రజాప్రతినిధులు అధికారులను సమీక్షలు, సమావేశాలకు పిలవకూడదు.
- పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచే ప్రచారాలు ఆపేయాలి.
- నామినేషన్లు వేసేటప్పుడు మూడు వాహనాలను, కేవలం ఐదుగురిని మాత్రమే ఆర్వో కార్యాలయంలోనికి అనుమతిస్తారు.

చేసుకోదగినవి..

- న్యాయస్థానం అనుమతి ఉన్న ఉద్యోగ నియమాకాల ప్రక్రియను పూర్తి చేయవచ్చు.
- కరువు నివారణ పనులను చేపట్టవచ్చు. కరువు ప్రాంతాలకు ఆహార సరఫరా చేయవచ్చు.
- ప్రత్యర్థి పార్టీ విధి విధానాలను విమర్శించవచ్చు. రాజకీయ పార్టీలు ముందస్తు అనుమతితో ఊరేగింపులు, ర్యాలీలు చేయవచ్చు.

ప్రచారంలో ఇవి చేయవద్దు..

- ప్రజల మధ్య శతృత్వం పెరిగేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదు.
- మతపరమైన ప్రార్థనామందిరాల్లో, కులం, మతం, ప్రాంతం, వర్గం, జాతి విభేదాలు వంటి సున్నితమైన అంశాలతో ప్రచారం చేయవద్దు.
- అనుమతి ఉన్న వాహనాల్లో మాత్రమే వెళ్లి ప్రచారం చేయాలి. ఇందులో ఐదుగురికంటే ఎక్కువగా ప్రయాణించకూడదు.

కోలాహలంగా జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు



జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 21: జిల్లా అథ్లెటిక్స్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జేఎన్ఎస్‌లో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రీడా ఎంపిక పోటీలు ఆదివారం కోలాహలంగా ప్రారంభమయ్యాయి. అండర్-14 బాలబాలికల విభాగంలో 100, 600 పరుగు పందెంతో పాటు అండర్-16 విభాగంలో 100, 400, 800, 2వేల మీటర్ల పరుగు పందెంలో ఎంపిక పోటీలు నిర్వహించడం జరిగిందని అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సారంగపాణి తెలిపారు. అదే విధంగా అండర్-18 బాలబాలికల విభాగంలో 100, 400, 800, 1500, 5000 మీటర్స్‌తోపాటు అండర్-20 బాలికలకు 100, 400, 800, 1500, 5000, మెన్ అండ్ ఉమెన్ విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎంపిక పోటీల్లో 150 మంది బాలబాలికలు పాల్గొన్నట్లు సారంగపాణి తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఈ నెల 28న సూర్యపేట జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ కోచ్‌లు, టెక్నికల్ అఫీషియల్స్ అసోసియేషన్ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి

▸▸ మహబూబాబాద్ మండలం ఉత్తరతండాలో ఘటన



బోడ రమేష్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 21 : ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి యువ రైతు మృతి చెందిన ఘటన ఉత్తరతండాలో ఆదివారం చోటు చేసుకుంది. మానుకోట రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఉత్తరతండాకు బోడ కిషన్-కమ్లీ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. వారికున్న 2.20 ఎకరాల్లో వరిపంటను సాగు చేశారు. ఈ క్రమంలో వరిపంటకు నీరు పెట్టేందుకు వ్యవసాయ బావి వద్దకు తండ్రి బోడ కిషన్‌తో కలిసి కుమారుడు బోడ రమేష్(35) వెళ్లాడు. మోటారుకు లెవల్ ఆగడంలేదని పైపును కదిలిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు పైపుఊడి పక్కనే ఉన్న బావిలో పైపుతో సహా కుమారుడు రమేష్ పడ్డాడు. ఇది గమనించిన తండ్రి కిషన్ కొడుకును కాపాడుకునేందుకు తాను కట్టుకున్న దోతిని విప్పి కొడుకుకు అందించే ప్రయత్నం చేసినప్పటికీ రమేష్‌కు ఈతరాకపోవడంతో బావిలో మునిగి మృతి చెందాడు. కన్న కొడుకు కళ్లముందే మృతి చెందడంతో కిషన్ బోరున విలపించాడు. మృతుడు రమేష్‌కు భార్య సరిత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి తండ్రి కిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దీపికరెడ్డి తెలిపారు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత ఉత్తరతండాకు చేరుకుని రమేష్ మృతదేహంపై పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ జరిపించాలి

▸▸ సీపీయూఎస్ఐ పార్టీ దళిత బహుజన శ్రామిక విముక్తి నేత వెంకన్న

మహబూబాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో ఈ నెల 16న జరిగిన ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ జరిపించాలని సీపీయూఎస్ఐ పార్టీ దళిత బహుజన శ్రామిక విముక్తి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి దైద వెంకన్న అన్నారు. ఆయన పేరిట 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి ఆదివారం పంపిన లేఖలో పలుఅంశాలను పేర్కొన్నారు. దేశంలో ఖనిజ సంపదను బహుళజాతి సంస్థలకు అప్పగించడం కోసమే నరహంతక బీజేపీ, మోదీ, అమిత్‌షాలు ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో దండ కారణ్యంలోకి వేలాది సోల్జర్, బలగాలను దింపి అమాయక ఆదివాసీ బిడ్డలను నిర్బంధించి హింసిస్తూ, హత్యలు చేస్తున్నారన్నారు. మరోపక్క మావోయిస్టు సభ్యులను పార్టీ అంతర్గత సమాచారం కోసం చిత్రహింసలు పెట్టి కాల్చిచంపి బూటకపు ఎన్‌కౌంటర్ చేస్తూ ఎదురు కాల్పుల్లో మావోయిస్టు ఎన్‌కౌం టర్ అంటూ కట్టుకథలు అల్లుతున్నారని ఆరోపించారు. హిడ్మా ఆపరేషన్ అంటూ ఒక విప్లవకారుడి కోసం వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఇన్‌ఫార్మర్ వ్యవస్థకు, పోలీస్ వ్యవస్థకు ఖర్చు చేస్తూ వృధా చేస్తున్నారని చెప్పారు.

నిజంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి పాటు పడాలనే తపన పాలక వర్గాలకు ఉన్నట్లయితే నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని, పేదలకు సంక్షేమ ఫలాలను అందించాలని, పేదల అభివృద్ధి ముఖ్యం కాదు.. కేవలం విప్లవకారులని అంతం చేయడమే ముఖ్యమన్నట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని దైద వెంకన్న చెప్పారు. 15 రోజుల్లో 70 మందిని ఎన్‌కౌంటర్ల పేరిట హత్య చేశామని అమిత్‌షా పత్రిక ముఖంగా ప్రకటించడం సమాజం గమనించాలన్నారు. దేశంలో ఇంత శాతం విద్య, ఇంత శాతం వైద్యం, ఇంత మందికి ఉద్యోగాలు కల్పించామని, పది సం వత్సరాల్లో చెప్పలేని మోదీ, అమిత్‌షాలు 70 మంది ఆదివాసీ బిడ్డల్ని హత్య చేశామని చెప్పడం సిగ్గు చేటన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు మతోన్మాద ఫాసిస్టు బీజేపీ, మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. వెంటనే ఛత్తీస్‌ఘడ్ అడవుల్లో ఉన్న పోలీస్ బలగాలను వెనక్కి రప్పించి, కూంబింగ్‌ను నిలిపివేయాలన్నారు. అమాయక ఆదివాసీ బిడ్డలను బూటకపు ఎన్‌కౌంటర్లలో హత్య చేసిన పోలీసులకు శిక్షపడేలా సుప్రీంకోర్టు న్యాయమూర్తిచే న్యాయవిచారణ జరిపించాలన్నారు. ఛత్తీస్‌ఘడ్ ఎన్‌కౌంటర్లను అన్ని విప్లవశక్తులు, వామపక్షాలు, విద్యార్థి, యువజన, మహిళ, విద్యావేత్తలు, మేధావులు, కవులు, ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

▸▸ ఇరువురు మృతి



జస్వంత్ (ఫైల్)



మోహన్ (ఫైల్)

డోర్నకల్ (మహబూబాబాద్ జిల్లా), ఏప్రిల్ 21 : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు మృతి చెందిన సంఘటన డోర్నకల్ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. డోర్నకల్ సీఐ ఉపేందర్ రావు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వెన్నారం గ్రామపంచాయతీ శివారు రామకుంటతండాకు చెందిన తేజావత్ జస్వంత్ నాయక్(23) బంధువు మంగీలాల్‌తో కలిసి డోర్నకల్‌నుంచి వెన్నారంకు వెళ్తున్నారు. అదే సమయంలో ఖమ్మం జిల్లా కాశీరాజుగూడెం ఆరేకోడు తండాకు చెందిన బానోత్ మోహన్(47) భార్య పార్వతి, కూతురు అనూషతో కలిసి ద్విచక్ర వాహనంపై డోర్నకల్ వైపు వస్తున్నారు. ఇండియన్ గ్యాస్ గోదాం వద్దకు రాగానే జస్వంత్ తన ద్విచక్ర వాహనం ముందు వెళ్తున్న ఓ వాహనం ఓవర్‌టేక్ చేసే సమయంలో ఎదురుగా వస్తున్న బానోత్ మోహన్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో జస్వంత్, మంగీలాల్, మోహన్‌లకు తీవ్ర గాయాలు కాగా, పార్వతి, అనూషలు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు వెంటనే 108 ద్వారా చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వారిని పరీక్షించిన వైద్యులు అప్పటికే జస్వంత్ మృతి చెందినట్లు నిర్ధారించారు. బానోత్ మోహన్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మంగీలాల్ పరిస్థితి విషమంగా ఉండడంతో బంధువులు మెరుగైన చికిత్స కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బానోత్ మోహన్ భార్య పార్వతి, కూమార్తె అనూష మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదానికి గురైన రెండు ద్విచక్ర వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఓపెన్ వర్సిటీతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు

▸▸ వర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ సమ్మయ్య




మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ సమ్మయ్య

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 21 : అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయని అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ డి.సమ్మయ్య అన్నారు. ఆదివారం హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ స్టడీ సెంటర్ నేతృత్వంలో స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆలువాల సంజీవయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీడీ సమ్మయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంబేద్కర్ స్టడీ సెంటర్ అందిస్తున్న కోర్సులను సద్వినియోగం చేసుకుని, కష్టపడి చదివి వృద్ధిలోకి వచ్చారని చెప్పారు. విద్యార్థులకు సపోర్టు సర్వీసెస్‌పై మార్గదర్శకం చేశారు. తరగతులను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆలువాల సంజీవయ్య మాట్లాడుతూ.. ఓపెన్ ఎడ్యుకేషన్‌పై విద్యార్థులకు పలు సందేహాలను నివృత్తి చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ శ్రవణ్‌కుమార్, సతీశ్, వేణుమాధవ్, కుమారస్వామి, నవ్య రాణి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కడియం శ్రీహరిని కొనే దమ్ము ఎవరికీ లేదు!

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



ఆంధ్రజ్యోతి ప్రతినిధి : కావ్య హిందువు కాదనే ప్రచారం ఎందుకు జరుగుతోంది.. అసలు వాస్తవం ఏమిటీ..?

కడియం శ్రీహరి : కావ్య నా కూతురు. నేను షెడ్యూల్ కులానికి చెందిన వ్యక్తిని. నా చదువులు, రాజకీయం మొత్తం ఎస్సీ వ్యక్తిగానే సాగింది. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం తండ్రీ కులమే పిల్లలకు వర్తిస్తది. అది తెలియకుండా మాట్లాడుతున్నారు. ఆమె స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ కింద వివాహం చేసుకున్నది. ఈ యాక్ట్ ప్రకారం దంపతులు ఎవరి మతాన్ని వారు కొనసాగించుకోవచ్చు. సుప్రీం కోర్టు తీర్పుపై అవగాహన లేకుండా మాట్లాడుతూ ప్రజలను అ యోమయానికి గురి చేస్తున్నారు. వందకు వందశాతం కడియం కావ్య షెడ్యూల్ కులానికి, హిందు మతానికి చెందిన మహిళ.

కాంగ్రెస్‌లో మీరు కొత్త.. మిగతా నేతల నుంచి ఎలాంటి సహకారం లభిస్తోంది..?

కాంగ్రెస్ పార్టీ నుంచి పూర్తి సహకారం లభిస్తోంది. ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు కావ్య అభ్యర్థిత్వానికి పూర్తిగా మద్దతుగా నిలుస్తున్నారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ బలంగా ఉంది. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కాం గ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీగా ఓటింగ్ లభించింది. కార్యకర్తలు కూడా కావ్యను ఎంపీగా లోక్‌సభకు పంపించాలనే లక్ష్యంతో పని చేస్తున్నారు. అందరి సహకారంతో కావ్య మంచి మెజార్టీతో గెలవబోతున్నారు.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం అని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. డాక్టర్ కడియం కావ్యను వరం గల్ ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన తరువాత వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో విస్తృతంగా ప్రచారం మొదలు పెట్టామ న్నారు. బూత్ స్థాయి నుంచి మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నాం.చౌకబారు, దిగజారుడు విమర్శలు చేయవద్దన్నారు. కడియం శ్రీహరి ఎన్నడు కూడా డబ్బులకు అమ్ముడు పోయే వ్యక్తి కాదు. ఏనాడు కూడా అవినీతి కి, భూ కబ్జాలకు పాల్పడలేదని నా వ్యక్తిగ త్వాన్ని డ్యామేజ్ చేసేందుకు ఇలాంటి ప్రచా రం చేస్తున్నారని తదితర అంశాలపై ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో కడియం ప్రస్తావించారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి : ఎన్నికల ప్రచారం ఎలా జరుగుతోంది..? ఎలాంటి స్పందన వస్తోంది..?

కడియం శ్రీహరి : డాక్టర్ కడియం కావ్యను వరంగల్ ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన తరువాత వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో విస్తృతంగా ప్రచారం మొదలు పెట్టాం. బూత్ స్థాయి నుంచి మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నాం. సోషల్ మీడియా సమావేశాలు, ప్రతీ రోజు ఉదయం వాకర్స్‌ను కలుసుకుంటున్నాం. ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి : కూతురు రాజకీయ భవిష్యత్ కోసమే శ్రీహరి పార్టీకి ద్రోహం చేశారని బీఆర్ఎస్ అంటుంది కదా..?

కడియం శ్రీహరి : బీఆర్ఎస్‌కు రాజీనామా చేయడానికి ప్రధాన కారణం పార్టీ సంస్థాగతంగా నిర్మాణం లేకపోవటం.. పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేకపోవటమే. అసెంబ్లీ ఎన్నికలకు ముందు, ఆ తరువాత కూడా కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులకు పార్టీ నిర్మాణం గురించి చెప్పిన పట్టించుకోకపోవటం, అలాగే కడియం కావ్యను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన తరువాత బీఆర్ఎస్ నాయకులు ఎవరు కూడా సహకరించకపోవటం, ఒక్క నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించకపోవటంతో కడియం కావ్య అభ్యర్థిత్వాన్ని వారు వ్యతిరేకిస్తున్నట్లుగా నేను అభిప్రాయపడ్డాను. వాస్తవంగా ఎవరు లేని పరిస్థితుల్లో కడియం కావ్యకు టికెట్ ఇచ్చారు. మొదటి అరూరి రమేష్‌కు టికెట్ ఇవ్వాలని అందరం సూచించాము. అయితే ఆయన టికెట్ నిరాకరించి వేరే పార్టీలోకి వెళ్లి పోయారు. సిట్టింగ్ ఎంపీ దయాకర్‌కు టికెట్ ఇచ్చే విషయంలో కేసీఆర్ ఎందుకో సుముఖంగా లేరు. తాటికొండ రాజయ్య అప్పటికే పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయారు. దీంతో ఎవరు లేని పరిస్థితుల్లో కావ్యకు టికెట్ ఇచ్చారు. అయితే వరగంల్ నేతల నుంచి సరైరా సహకారం లేకపోవటం వల్లే నిర్ణయం తీసుకోని బయటకు వెళ్లాల్సి వచ్చింది. పార్టీకి ద్రోహం చేయాలనే ఉద్దేశ్యంతో కాదు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి : పార్టీ ఫండ్ తీసుకుని కాంగ్రెస్‌లోకి జంప్ అయ్యారనే ఆరోపణలపై మీరేమంటారు..?

కడియం శ్రీహరి : కేసీఆర్‌కు భక్తి ఎక్కువ.. దేవుడిపై నమ్మకం కూడా ఎక్కువ.. కడియం కావ్యను అభ్యర్థిగా ప్రకటించి డబ్బులు కూడా ప్రచారం కోసం ఇచ్చామని ఆయన ప్రమాణం చేసి చెప్పినట్లైయితే అభ్యర్థిని విరమించుకోవడానికి సిద్ధంగా ఉన్నాం.. నేను కూడా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. చౌకబారు, దిగజారుడు విమర్శలు చేయవద్దు. కడియం శ్రీహరి ఎన్నడు కూడా డబ్బులకు అమ్ముడు పోయే వ్యక్తి కాదు. ఏనాడు కూడా అవినీతికి పాల్పడ లేదు.. భూ కబ్జాలకు పాల్పడ లేదు. దందాలు చేయలేదు. నా వ్యక్తిగతాన్ని డ్యామేజ్ చేసేందుకు ఇలాంటి ప్రచారం చేస్తున్నారు. ఏ ఆధారం ఉన్నా బయట పెట్టండని బీఆర్ఎస్ నాయకులకు సవాల్ చేస్తున్నాను. నా సవాల్‌ను స్వీకరించకపోతే బీఆర్ఎస్ చేసే విమర్శలు నిరాధారమైనవని ప్రజలు భావిస్తారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి : కూతురిని నాన్న గెలిపిస్తాడా..?

కడియం శ్రీహరి : కూతురిని నాన్న గెలిపించటం కాదు. కూతురిని ప్రజలు గెలిపించాలి. ప్రజల ఆశీర్వాదం ఉండాలి. కూతురికి నాన్న ఆశీర్వాదం ఉంటుంది. ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో కడియం శ్రీహరి గురించి ప్రజలకు పూర్తిగా తెలుసు. ఏనాడు భూకబ్జాలకు పాల్పడలేదు. ఏ రకమైన అవినీతికి పాల్పడలేదు. కాంట్రాక్టులు తీసుకోలేదు. నాపై తీవ్రస్థాయిలో విరుచుకపడుతున్న బీఆర్ఎస్ నాయకులు అక్కసుతో, అసహనంతో మాట్లాడుతున్నట్లు కనిపిస్తోంది. నేను ప్రత్యేకంగా దయాకర్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సవాల్ విసురుతున్నాను. నేనే ఏ రకంగా అవినీతికి పాల్పడ్డట్లు, భూకబ్జాలు, కాంట్రాక్టులు తీసుకున్నట్లు ఏమైనా ఆధారాలు ఉంటే బయట పెట్టండి. నేను ప్రజలకు క్షమాపణలు చెప్పి రాజకీయాల నుంచి తప్పుకుంటాను. దయాకర్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని అడ్డు పెట్టుకుని వ్యాపారాలు చేస్తున్నారో.. మెడికల్ కాలేజీలు, యూనివర్సిటీ తెచ్చుకున్నారో ఆధారాలతో చూపిస్తా.. వారు రాజకీయాల నుంచి తప్పుకుంటారా.. నిజంగా నైతికత ఉంటే నా సవాల్‌ను వారు స్వీకరించాలి.. లేదంటే పనికి మాలిన విమర్శలు మానుకోవాలి.

కొరడా ఝులిపిస్తున్న బల్దియా కమిషనర్

▸▸ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు షోకాజు నోటీసులు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 21 : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై కొరడా ఝులిపిస్తున్నారు. బల్దియాలో విధుల్లో చేరినప్పటి నుంచి ప్రతీ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ గతంలో మాదిరిగా విధులు నిర్వర్తిస్తే చెల్లదని హెచ్చరిస్తున్నారు. ఇటీవల బాలసముద్రంలోని వెహికిల్ షెడ్ నుంచి డీజిల్ చోరీకి పాల్పడిన ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు వేశారు. అక్కడి అధికారులను సైతం హెచ్చరిస్తూ అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్లనే దొంగతనాలు జరుగుతున్నాయని, ఇకపై ఏదైనా తప్పు జరిగితే అధికా రులదే బాధ్యత అని హెచ్చరిస్తూ మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. తాజాగా శనివారం నగరంలో ఆకస్మిక తనిఖీలలో భాగంగా కమిషనర్ శానిటేషన్ ప్రధాన అధికారి డాక్టర్ మల్లం రాజేశ్‌తో కలిసి కాశిబుగ్గ 14వ డివిజన్‌లో పర్యటించారు. ఈ క్రమంలో కమిషన్‌కు చెత్తా, చెదారంలో కూడిన డ్రైనేజీ కనిపించింది. మునిసిపల్ సిబ్బంది ఇటువైపు కూడా చూడడం లేదని, రోడ్లు, డ్రెయినేజీలు శుభ్రం చేయడం లేదని స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సంబంధిత శానిటరి ఇన్‌స్పెక్టర్ ఇశ్రం శ్రీనును పిలిపించి మందలించింది. కమిషనర్ కార్యాలయం నుంచి ఆదివారం సాయంత్రం షోకాజు నోటీసు (మెమో) జారీ చేస్తూ ఉత్తర్వులు అందించారు. జరిగిన తప్పుకు వివరణ ఇవ్వాలని సంబంధిత అధికారులను కోరినట్టు తెలిసింది.

చైల్డ్‌లైన్‌కు ఇద్దరు బాలికల అప్పగింత

గిర్మాజీపేట, ఏప్రిల్ 21 : తల్లి వదిలేసి వెళ్లిన ఇద్దరు బాలికలను వరంగల్ ఆర్‌పీఎఫ్ సిబ్బంది చైల్డ్‌లైన్‌కు అప్పగించిన సంఘటన వరంగల్ రైల్వే స్టేషన్‌లో జరిగింది. ఆదివారం వరంగల్ ఆర్‌పీఎఫ్ సీఐ టీఎస్ఆర్ కృష్ణ విలేఖరులకు తెలిపిన ప్రకారం. శనివారం రాత్రి వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ ఎస్సై ఎస్.కె.సుభాని, మహిళా కానిస్టేబుల్ కుమారి నీలం మింజి విధి నిర్వహణలో భాగంగా రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టింది. మొదటి ప్లాట్‌ఫాం వైపు ఉన్న టికెట్ బుకింగ్ కార్యాలయం వద్ద రాత్రి 10.15 గంటల సమయంలో అనుమానాస్పదంగా తొమ్మిది, ఏడు సంవత్సరాల వయస్సు కలిగిన ఇద్దరు బాలికలు ఎస్సై, మహిళా కానిస్టేబుల్‌లకు కనిపించారు. వారి దగ్గరకు వెళ్లి అడుగగా వచ్చిరాని తెలుగులో తమను తల్లి వదిలేసి వెళ్లిపోయిందని, తమది కర్నాటక హుబ్లీ అని చెప్పారు. వెంటనే చిన్నారులను వరంగల్ ఆర్‌పీఎఫ్ ఠానాకు తరలించి చైల్డ్‌లైన్ 1098కు సమాచారమిచ్చి, చిన్నారులకు భోజనం, బిస్కెట్లు అందచేసినట్లు సీఐ తెలిపారు. పిల్లలతో మాట్లాడితే తల్లితో కలిసి నెల రోజుల క్రితం వరంగల్‌లోని అంకుల్ ఇంటికి వచ్చా మని, శనివారం తల్లి తమను రైల్వేస్టేషన్‌లో వదిలివెళ్లినట్లు చెప్పారని సీఐ తెలిపారు. అనంతరం చైల్డ్‌లైన్ ప్రతినిధి మౌనికకు ఇద్దరు చిన్నారులను అప్పగించగా హనుకొండలోని ప్రభుత్వ బాలసదనంలో చేర్పినట్లు సీఐ తెలిపారు.

కార్పొరేట్ సంస్థలకు దేశాన్ని తాకట్టు పెట్టిన మోదీ

▸▸ సమన్యాయం జరగాలంటే రాహుల్ ప్రధాని కావాలి

▸▸ పార్టీ సోషల్ మీడియా సెల్ కీలక పాత్ర పోషించాలి

▸▸ కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య



హనుమకొండ జేఎన్ స్టేడియంలో బాక్సింగ్ క్రీడాకారులతో కడియం కావ్య

హనుమకొండ సిటీ/వర్ధన్నపేట, ఏప్రిల్ 21: బడా బాబుల కార్పొరేట్ సంస్థలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశాన్ని తాకట్టు పెట్టాడని వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య ఆరోపించారు. ఆదివారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో వరంగల్ పార్లమెంట్ స్థాయి సోషల్ మీడియా సమావేశం జరిగింది. టీపీసీసీ సోషల్ మీడియా కార్యదర్శి, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ముస్తాక్ నేహాల్, హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ కేతిడి దీపక్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తదితర ముఖ్య నేతలతో కలిసి కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పదేళ్ల మోదీ పాలనలో దేశంలో అరాచకాలు, మత విద్వేషాలు పెరిగాయే తప్ప ప్రజాసంక్షేమం, దేశాభివృద్ధి జరగలేదన్నారు.

రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అవ్వడం ద్వారానే దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని కావ్య అన్నారు. రాహుల్‌ను ప్రధానమంత్రిగా చేసుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. బీజేపీ ప్రచారం చేస్తున్న అబద్ధాలను తిప్పికొట్టడంలో కాంగ్రెస్ సోషల్ మీడియా సెల్ కీలక పాత్ర పోషించాలని కావ్య సూచించారు.

సోషల్ మీడియా శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన ఆరు గ్యారెంటీలు తోడ్పడ్డాయన్నారు. మేనిఫెస్టోను యువతకు చేరవేస్తే మంచి ఫలితాలు ఉంటాయని వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ సూచించారు.

ప్రచార రథాన్ని ప్రారంభించిన నాయిని, కడియం కావ్య

సమావేశం అనంతరం డీసీసీ భవన్ ఎదుట లోక్‌సభ ఎన్నికల ప్రచార రథాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి కడియం కావ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, టీపీసీసీ సభ్యులు నమిండ్ల శ్రీనివాస్, బత్తిని శ్రీనివాస్‌రావు, ఈవీ శ్రీనివాస్‌రావు, టీపీసీసీ ఎస్సీ సెల్ కో-ఆర్డినేటర్ మోజెస్ ఆనంద్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళా యాదవ్, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, జక్కుల రవీందర్ యాదవ్, ఇనుగాల రాంప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.

అరూరి ధన బలంతో విర్రవీగుతున్నాడు..

వర్ధన్నపేట సమావేశంలో కడియం కావ్య

బీజేపీ లోక్‌సభ అభ్యర్థి, మాజీఎమ్మెల్యే అరూరి రమేశ్ ధన బలంలో విర్రవీగుతున్నాడని కడియం కావ్య విమర్శించారు. ఆదివారం హనుమకొండ హంటర్ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే నాగరాజు అధ్యక్షతన వర్ధన్నపేట నియోజకవర్గ సమావేశం జరిగింది. వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, డీసీసీ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నసమావేశాన్ని ఉద్దేశించి కడియం కావ్య మాట్లాడారు. భూకబ్జాలు చేసి అరూరి రమేశ్ ప్రజాభిమానాన్ని కోల్పోయాడని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రజలు మరోసారి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో ఈ నెల 24న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్‌కు రాక, సభ నిర్వహణ, నియోజకవర్గం నుంచి శ్రేణుల తరలింపు, ఏర్పాట్లు తదితర అంశాలను ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు చర్చించారు.

అలాగే ఆదివారం ఉదయం మార్నింగ్ వాక్ ప్రచారంలో భాగంగా హనుమకొండ జేఎన్ఎస్‌లో ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, నాగరాజుతో పాటు పార్టీ ముఖ్య నేతలతో కలిసి వాకర్స్, క్రీడాకారులను కడియం కావ్య కలిసి పలకరిస్తూ ముందుకు సాగారు. ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. స్టేడియంలో క్రికెట్ ఆడారు. బాక్సింగ్ గ్లౌజ్ ధరించి పంచ్‌లిచ్చారు. ఇలా ప్రతి ఒక్క క్రీడాకారుడిని కలిసి పరిచయం చేసుకుంటూ ప్రచారంతో సందడి చేశారు.

నేటి నుంచి పుష్‌పుల్ రైలు రద్దు

▸▸ మే 26 వరకు నిలిపివేత..

▸▸ 28 నుంచి మే 22 వరకు కృష్ణ ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

గిర్మాజిపేట, ఏప్రిల్ 21 : సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలో సోమవారం నుంచి వచ్చే నెల 26 వరకు చేపట్టిన రోలింగ్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా వరంగల్ మీదుగా సికింద్రాబాద్, డోర్నకల్‌కు నడిచే పుష్‌పుల్ రైళ్లను దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసింది. అలాగే వరంగల్-ఆదిలాబాద్, తిరుపతి వెళ్లె కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 28 నుంచి వచ్చే నెల 22 వరకు వరంగల్‌కు రాకుండా దారిమళ్లిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఉత్తర్వులు జారీ చేసింది. రైళ్ల పూర్తి, పాక్షిక రద్దు, దారి మళ్లింపులను దృష్టిలో పెట్టుకుని ప్రయాణాలను చేయాలని దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికులను కోరింది. ప్రస్తుతం ప్రతీ రోజు ఉదయం 9 గంటలకు సికిందరాబాద్ నుంచి వరంగల్(07462)కు వచ్చి తిరిగి మధ్యాహ్నం 1.45 గంటలకు వరంగల్ నుంచి హైదరాబాద్(07263) వెళ్లే పుష్‌పుల్ రైళ్లను సోమవారం నుంచి మే 26వ తేదీ వరకు పూర్తిగా రద్దు చేశారు. అలాగే ప్రతీ రోజు ఉదయం 6.30 గంటలకు వరంగల్‌లో బయలుదేరే కాజీపేట-డోర్నకల్ ప్యాసింజర్(07753), రాత్రి డోర్నకల్ నుంచి వరంగల్ మీదుగా కాజీపేట(07754)కు వచ్చే డోర్నకల్-కాజీపేట ప్యాసింజర్ పూర్తిగా రద్దు చేశారు. ప్రతి రోజు నడిచే డోర్నకల్-విజయవాడ(07755), విజయవాడ-డోర్నకల్(07756) ప్యాసింజర్ రైళ్లను కూడా ఈ నెల 29 నుంచి మే 22వ తేదీ వరకు పూర్తిగా రద్దు చేశారు.

28 నుంచి వరంగల్‌కు రాని కృష్ణ ఎక్స్‌ప్రెస్

ఈ నెల 28 నుంచి మే 10, మే 15 నుంచి మే 22వ తేదీ వరకు కృష్ణ ఎక్స్‌ప్రెస్ వరంగల్‌కు రాదు. వరంగల్ మీదుగా ఆదిలాబాద్-తిరుపతి మధ్య నడుస్తున్న కృష్ణ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 28 నుంచి మే 10 వరకు, మే 15 నుంచి 22 వరకు వరంగల్ రాకుండా దారిమళ్లించారు. 28 నుంచి మే 9 వరకు, మే 15 నుంచి మే 21 వరకు ఆదిలాబాద్ నుంచి తిరుపతి వెళ్లె కృష్ణ ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ నుంచి పగిడిపల్లి, గుంటూరు, తెనాలి, గూడూరు మీదుగా తిరుపతి చేరుకుంటుంది. ఈనెల 29 నుంచి మే10, మే 16 నుంచి మే 22 వరకు తిరుపతి నుంచి కృష్ణ ఎక్స్‌ప్రెస్ గూడూరు, తెనాలి, గుంటూరు, పగిడిపల్లి మీదుగా సికింద్రాబాద్ చేరుకుని ఆదిలాబాద్ వెళ్తుందని అధికారులు తెలిపారు. మే 3, 4 తేదీల్లో సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్ భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌ను కాజీపేట-సికింద్రాబాద్ మధ్య పాక్షికంగా రద్దు చేసినట్లు రైల్వే శాఖ పేర్కొంది.

గంజాయితో పట్టుబడిన యువకులు

▸▸ వివరాలు వెల్లడించిన ఏసీపీ దేవేందర్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 21: గంజాయి సేవిస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన నలుగురు యువకులను అరెస్టు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పద్మాక్షికాలనీ శ్మశానవాటికలో యువకులు గంజాయి సేవిస్తున్నారని పక్కా సమాచారం రావడంతో శనివారం మధ్యాహ్నం ఎస్సై శ్రీనివాస్ సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లారు. ఆసమయంలో ఆత్మకూరు మండలం పెంచికలపేట గ్రామానికి చెందిన జంగం వంశీకృష్ణ, చిల్పూర్ మండలం వంగాలపల్లి గ్రామానికి చెందిన అరూరి వంశీ, పద్మాక్షికాలనీ ఆనంద్‌నగర్‌కు చెందిన ఐత శివ, పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన బుగ్గ నవీన్‌లు గంజాయి సేవిస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. నిందితుల నుంచి సుమారు రూ.30వేల విలువ చేసే 2 కిలోల గంజాయితో పాటు రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. కాగా, నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్ వై.సతీష్, ఎస్సైలు శ్రీనివాస్, పరుశురాములు, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, అశోక్, కానిస్టేబుల్ కిరణ్‌ను ఏసీపీ అభినందించారు.

వ్యవసాయ కోర్సులకు 'ఐకార్' నోటిఫికేషన్ విడుదల

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 21 : వ్యవసాయ సంబంధిత పీజీ కోర్సుల్లో 2024-25 విద్యా సంవత్సరం అడ్మిషన్ల కోసం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఆలిండి యా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ ఫర్ అడ్మిషన్(ఐకార్ ఏఐఈఈఏ పీజీ) 2024 నోటిఫికేష న్ ఇటీవల విడుదల చేసింది. ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహిస్తోంది. పరీక్షల్లో సాధించిన ప్రతిభ ఆధారంగా దేశ వ్యాప్తంగా ఉన్న 74 వ్యవసాయ విశ్వవిద్యాలయాలు అందిస్తున్న కోర్సుల్లో ప్రత్యేకించిన సీట్లలో ప్రవేశాలు కల్పిస్తారు.

విభాగాల కోర్సులు

ప్లాంట్ బయోటెక్నాలజీ, ప్లాంట్‌సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, ఎంటమాలజీ అండ్ నెమటాలజీ, ఆగ్రోనమీ, సోషల్ సైన్సెస్, స్టాటికల్ సైన్సెస్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ, కమ్యూనిటీ సైన్స్ యానిమల్ బయోటెక్నాలజీ, వెటర్నరీ సైన్స్, యానిమల్ సైన్సెస్, ఫిషరీస్ సైన్స్, డైయిరీ సైన్స్, డైయిరీ టెక్నాలజీ, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, వాటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ.

అర్హత

సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీటెక్, బీవీఎస్సీ, బీఎఫ్ఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో మే 11 వరకు దరఖాస్తులు చేసుకోవాలి. పరీక్ష జూన్ 29న నిర్వహిస్తారు. హైదరాబాద్/సికింద్రాబాద్/రంగారెడ్డి, కరీంనగర్, వరంగల్‌లో పరీక్ష కేంద్రాలున్నాయి. పూర్తి వివరాలకు www.exams.nta.ac.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలి.



గం'జాయ్'!

5వ పేజీ తరువాయి

తాగుతూ మత్తులో విహరిస్తున్నారని సమాచారం. దీంతో చాలా చోట్ల మత్తులో యువత రచ్చ రచ్చ చేసిన సంఘటనలు ఉన్నాయి. గత మార్చి 25వ తేదీన వరంగల్ శంభునిపేట ప్రాంతంలో గంజాయి మత్తులో ఓ బాలురు నడుచుకుంటూ వెళుతున్న బాలికను ఈవ్‌టీజింగ్ చేస్తూ వేధించిన ఘటన కలకలం రేపింది. హనుమకొండ పోచమ్మకుంట ప్రాంతంలో మత్తులో స్థానికులపై కత్తితో దాడికి పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. ఇలా అనేక ప్రాంతాల్లో గంజాయి మత్తులో యువత వీరంగం సృష్టిస్తుంది. ఎన్నికల వేళ కావడంతో ఇది శాంతిభద్రతలకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ఈ ప్రాంతాల్లోనే మత్తెక్కేది..!

పల్లె, పట్నం తేడా లేకుండా ఇటీవల కాలంలో గంజాయి అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. పోలీసు యంత్రాంగం ఎన్నికల విధుల్లో ఉండడంతో స్మగ్లర్లకు పండుగ అవుతుందనే టాక్ వినబడుతోంది. ప్రధానంగా వరంగల్ మహానగరంలో ఎక్కువగా గొర్రెకుంట శివారు, కీర్తినగర్ కాలనీ, కోటిలింగాల గుడిరోడ్డులో గంజాయి సేవించే అడ్డాలుగా భావిస్తున్నారు. అలాగే కాశిబుగ్గ ఓసిటీ గ్రౌండ్, కొత్తవాడ కెనాల్ దారి, ఎల్‌బీనగర్, ఖిలావరంగల్ తూర్పు కోట ప్రాంతం, చింతల్ బ్రిడ్జి, శివనగర్ రైల్వే స్టేషన్ వైపు, సీకేఎం కాలేజీ మైదానం, చిన్నవడ్డెపల్లి చెరువు కట్ట, మండిబజార్ సమీపంలోని ఏరియా, ఇస్లామియా కాలేజీ గ్రౌండ్, రంగంపేట రోడ్డు, మ్యూజికల్ గార్డెన్, ఏనుమాముల మార్కెట్ వంద ఫీట్ల రోడ్డు, హనుమకొండ కుమార్‌పల్లి మార్కెట్, డబ్బాలు, ఆర్టీసీ బస్టాండ్, పద్మాక్షి ఆలయం ఏరియా రోడ్డు, యూనివర్సిటీ క్రాస్ రోడ్డు, పోచమ్మకుంట ప్రాంతం, నయీంనగర్, వడ్డెపల్లి, వందఫీట్ల రోడ్డు, హంటర్‌రోడ్డు, ఖమ్మం బైపాస్ రోడ్డు, కాజీపేట రైల్వే జంక్షన్, మడికొండ తదితర ప్రాంతాల్లో విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు, మత్తు పీల్చేందుకు అడ్డాలుగా ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. వీటితోపాటు భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సింగరేణి పిల్లలే లక్ష్యంగా గంజాయి ముఠా జోరుగా అమ్మకాలు చేస్తున్నట్లుగా సమాచారం. మహారాష్ట్ర నుంచి గంజాయి ముఠా భూపాలపల్లి పట్టణంలోని కృష్ణకాలనీ, సుభాష్‌కాలనీ, యాదవ్‌నగర్, కేటీకే 5వ గని ఏరియా చెట్ల పొదలు, సింగరేణి థౌజెండ్ క్వార్టర్స్ ఏరియా, మెడికల్ కాలేజీ రోడ్డు తదితర ప్రాంతాల్లో గంజాయి గుప్పుమంటున్నా పట్టించుకునే వారు కరువయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మహబూబాబాద్ పట్టణంలోని రైల్వే స్టేషన్ ఏరియా, నెహ్రూ సెంటర్, మార్కెట్, డోర్నకల్, కేసముద్రం, నెక్కొండ, స్టేషన్ ఘనపూర్, జనగామ తదితర రైల్వే స్టేషన్లు, ఇతర ప్రాంతాల ద్వారా గంజాయి మత్తు పల్లెలకు కూడా చేరుకుంటుందనే ప్రచారం జరుగుతోంది.

మహావీర్ జయంతి ర్యాలీ



బట్టల బజార్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 21: భగవాన్ మహావీర్ జయంతి సందర్భంగా ఆదివారం మహావీర్ భక్తులు రామన్నపేటలోని జైన్ మందిరంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహావీర్ చిత్రపటంతో వాహనంపై, డప్పు చప్పుళ్లతో, నామస్మరణతో బట్టల బజార్ ప్రాంతం నుంచి చౌరస్తా మీదుగా ర్యాలీ నిర్వహించారు. భగవాన్ మహావీర్ జయంతి సందర్భంగా పెద్దఎత్తున భక్తులు జైన్ మందిర్‌కు వచ్చి దర్శించుకున్నారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

భానుడి భగభగ

• 40 డిగ్రీలు దాటుతున్న ఉష్ణోగ్రత • పండ్ల రసాలను ఆశ్రయిస్తున్న జనం

వరంగల్ సిటీ, ఏప్రిల్ 21: ఎండలు మండుతున్నాయి. బయటకు వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. 40 నుంచి 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. మరోవైపు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం పదకొండు గంటల లోపు.. సాయంత్రంఐదు గంటల తరువాతనే ప్రజలు రోడ్డెక్కుతున్నారు. మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. కొబ్బరిబోండాలు, పండ్లు, పండ్ల రసాలు, నిమ్మరసాలు, ముంజలు తింటూ వేసవి నుంచి ఉపశమనం పొందుతున్నారు.

బొండాలకు భలే గిరాకీ..

భానుడు భగభగ మండుతుండడంతో జనం కొబ్బరిబోండాలను ఆశ్రయిస్తున్నారు. కొబ్బరినీటిలో పోషకాలు ఉండడంతో వైద్యులు కూడా దీనినే ప్రిఫర్ చేస్తున్నారు. రోజు లక్ష బోండాల వరకు అమ్ముడవుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఒక్కో బోండా రూ.30 నుంచి రూ.40లు, ఒక లీటర్ కొబ్బరిబోండా వాటర్‌కు రూ.120 నుంచి రూ.140 వరకు ధర పలుకుతోంది.



నగరంలో బోండాలు తాగుతున్న యువతులు

ముంజలు, పుచ్చ, నిమ్మరసం అంతే..

వేసవిలో అందుబాటులో ఉండే పుచ్చకాయలు, కీరదోస, కర్బూజా,మజ్జిగ, నిమ్మరసం, మజ్జిగ,లస్సీ, గోలీ సోడా, పండ్ల రసాలకు సైతం మంచి గిరాకీ ఉన్నది. రోడ్డు వెంట పోయేవారు ఎండ తీవ్రతకు రోడ్డు పక్కన ఏదీ అందుబాటులో ఉంటే దానిని సేవించి దాహం తీర్చుకుంటున్నారు. వీటి ధరలు కూడా ప్రజలకు అందుబాటులోనే ఉన్నాయి.

పండ్లలో పుష్కలంగా పోషకాలు

వేసవిలో లభించే కీరదోస, దోస, పుచ్చ, కర్బూజా, మామిడి, సపోట, ఆపిల్, ద్రాక్ష, చెర్రి, కొబ్బరి బొండాల వంటి వాటిలో పుష్కలంగా పోషక విలువలున్నాయి. పండ్లలో శరీరానికి మేలు చేసే పీచు పదార్థాలు, విటమిన్ ఏ,సీ, మినిరల్స్, పోటాషియం, మెగ్నీషియం, జింక్, పాస్ప రస్, ఐరన్, క్యాల్షియం, ఫోలేట్ వంటివి అధికంగా ఉం టాయి. ప్రస్తుతం కివి పండ్లు సైతం లభిస్తున్నాయి. సహజసిద్ధంగా యాంటీ ఆక్సిడెంట్లను ప్రసాదించే అద్భుతమైన ఫలాలను తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని వైద్యులు చెపుతున్నారు.



ఎంజీఎం సెంటర్‌లో ముంజల విక్రయాలు

వేసవిలోనే కొబ్బరిబోండాలకు గిరాకీ ...

ఆరీఫ్, కొబ్బరిబోండాల వ్యాపారి



వేసవికాలంలో ఎక్కువగా కొబ్బరిబోండాలకు గిరాకీ ఉంటుంది. ఆ తర్వాత పెద్దగా గిరాకీ ఉండదు. బోండాలను ఆంధ్రప్రదేశ్‌లోని ఈస్ట్, వెస్ట్ గోదావరి జిల్లాల నుంచి కొనుగోలు చేసి లారీల్లో తీసుకువస్తాం. కొబ్బరిబోండా రూ.30 నుంచి రూ.40లకు అమ్ముతాం. అదే కొబ్బరి వాటర్ లీటర్‌కు రూ.120 నుంచి 140ల వరకు అమ్ముతాం.

వేసవిలో ఎక్కువగా పండ్ల రసాలు తీసుకోవాలి

డాక్టర్ వెంకట్, ఎంజీఎం జనరల్ ఫిజిషియన్



వేసవికాలంలో కూల్‌డ్రింక్‌లను పక్కన పెట్టి ఎక్కువగా సీజన్‌లో దొరికే పండ్లు, పండ్ల రసాలను తీసుకోవాలి. నీటిశాతం ఎక్కువగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. దోసకాయ, పుచ్చకాయ, కర్బూజా, కొబ్బరిబోండాలు, నిమ్మరసం తీసుకోవాలి. పోషకాలు ఎక్కువగా ఉండడంతో పాటు వేడిచేయకుండా నుంచి రక్షణ ఇస్తాయి.



పండ్లతోనే ఆరోగ్యం

కరీమాబాద్: ఎండలు మండుతుండడంతో బలమైన ఆహారం తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. త్వరగా అలసటకు లోనవుతూ అనారోగ్యానికి గురవుతున్నారు. ఇలాంటి తరుణంలో పండ్లు ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడుతాయి. పండ్లు ఎక్కువగా తినడం వలన శరీరానికి కావాల్సిన పోషక విలువలు లభిస్తాయి.

దానిమ్మ... రక్తాన్ని శుద్ధి చేసే గుణం దానిమ్మ పండులో ఉంది. ఈ పండు తింటే రక్త హీనత నుంచి సునాయాసంగా బ యటపడొచ్చు. రోజు ఒక దానిమ్మపండు తినడం ద్వారా వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చు. 600 మిల్లీ గ్రాముల పొటాషియం, 102 గ్రాముల మి.గ్రా. పాస్పరస్, 34 మి.గ్రా. మెగ్నీషియం, 28మి.గ్రా. కాల్షియం, విటమిన్ సీ, ఈ, కే. బీ1, బీ2 విటమిన్లు, ఫైబర్ మెండుగా ఉంటాయి.

ఆపిల్ రోజుకి ఒక ఆపిల్ పండు తింటే వైద్యుడికి దూరంగా ఉన్నట్టే అనేది నానుడి. పెక్టిన్ అనే రసాయనం దండిగా ఉండే ఆపిల్ తినడం వల్ల ఉదర వ్యవస్థను ఆరోగ్యంగా ఉండేలా బ్యాక్టీరియా సంఖ్యను ఆపిల్ గణనీయంగా వృద్ధి చేస్తుంది. రక్తాన్ని శుద్ధి చేయడం లోనూ సమర్థవంతంగా పనిచేస్తుంది. వేసవిలో ఆపిల్ వల్ల శరీరానికి తగిన శక్తి లభిస్తుంది.

పైనాపిల్ పైనాపిల్ గుజ్జును తిన్నా లేదా ద్రవపదార్థంగా తీసుకున్నా అందులోని పోషక విలువలు శరీరానికి సమృద్ధిగా లభిస్తాయి. 100గ్రాముల పైనాపిల్‌లో 87.8 శాతం నీరు, 0.4గ్రాముల ప్రోటీన్లు, 10.8గ్రాముల పిండి పదార్థాలు, 20మి.గ్రా ఇనుము, 34.7మి.గ్రా. సోడియం, 37మి.గ్రా పొటాషియం, 0.50మి.గ్రా. మాంగనీసు ఉంటాయి.

ద్రాక్ష మూత్రపిండాలు సక్రమంగా పనిచేసేలా ద్రాక్ష తోడ్పడుతాయి. ద్రాక్ష పండను రోజు వారిగా తినడం వల్ల రక్త ప్రసరణ వేగవంతం చేస్తాయి. ఈ పండ్లు తేలికగా జీర్ణమవడమే కాకుండా జీర్ణాశయం చురుగ్గా పనిచేసేలా ఉపకరిస్తాయి. ద్రాక్షలో సీ, కే. విటమిన్‌లు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. క్యాన్సర్‌ను ఎదుర్కొనేందుకు ఈ పండ్లు పనిచేస్తాయి.

మామిడి మామిడిలో క్యాన్సర్ కణాలను అరికట్టేందుకు సమర్థవంతంగా పనిచేస్తుంది. విటమిన్ ఏ, బీ, సీ, మాంస కృత్తులు, పిండి పదార్థాలు, చక్కెర, పీచు పదార్థాలు, కొవ్వు పదార్థాలు, థయామిన్, నియాసిన్, పాంటోథిలిక్ ఆమ్లం, విటమిన్ బీ6, సి విటమిన్, మెగ్నీషియం, ఇనుము, భాస్వరం, పోటాషియం, తగిన మోతాదులో లభిస్తాయి.

పుచ్చకాయ పుచ్చకాయలో నీటీ శాతం అత్యధికంగా ఉంటుంది. ఈ పండులో ప్రధానంగా సుక్రోజ్, గ్లూకోజ్ పుష్కలంగా దొరుకుతాయి. వడదెబ్బ బారిన పడకుండా ఈ పుచ్చకాయ మెరుగ్గా పనిచేస్తుంది. విటమిన్ బీ6, సి, పీచు పదార్థాలు ఈ పుచ్చకాయలో తగిన మోతాదులో లభిస్తాయి.

దేశాన్ని అభివృద్ధిలో నడిపేది బీజేపీనే: అరూరి



పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న అరూరి రమేష్, మార్తినేని ధర్మారావు

వరంగల్ సిటీ, ఏప్రిల్ 21: దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించే సత్తా నరేంద్రమోదీకే ఉందని బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. ఆదివారం హంటర్‌రోడ్‌లోని తన కార్యాలయంలో ఏనుమాముల, బాలాజీనగర్, సుందరయ్య నగర్, లక్ష్మిగణపతి కాలనీ, ప్రతాపరుద్ర కాలనీలకు చెందిన సుమారు వంద మంది కార్యకర్తలు బీజేపీ నాయకుడు పత్రి సుభాస్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి రమేష్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావుకండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరివారు కోరుట్ల శ్రీనివాస్, మోతె రవి, బాలమోహన్, కొక్కర కొండ కుమారస్వామి, ఆవుల మల్లేశ్ ఉన్నారు.

- సంగెం: కేంద్ర పథకాలకు ఆకర్శితులై యువ కులు బీజేపీలో చేరుతున్నట్లు బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. హనుమకొండలోని తన నివాసంలో ఆదివారం 43వ డివిజన్ రాంగోపాలపురం నుంచి పలువురు బీఆర్‌ఎస్ పార్టీ నుంచి బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, అరూరి రమేష్‌లు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.
- మిల్స్‌కాలనీ: వరంగల్ పార్లమెంట్ సీటుపై కమలం జెండా ఎగురవేయడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. ఆదివారం ఓసిటీలోని ప్రదీప్‌రావు నివాసంలో పలువురు నాయకులు బీజేపీలో చేశారు. 27వ డివిజన్‌కు చెందిన ఏబివైఎఫ్ జిల్లా కోకన్వీనర్ పోలెపాక పవన్‌కుమార్ మిత్ర బృందం 50 మందితోపాటు నరేష్, తరుణ్, హేమంత్, రాకేష్ ప్రవీణ్, రిక్కీ, ఆశిష్, వంశీ తదితరులు బీజేపీలో చేరారు.
- మిల్స్‌కాలనీ: తూర్పు నియోజకవర్గంలో లక్ష ఓట్ల లక్ష్యంతో కార్యకర్తలు ముందుకు సాగాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో తూర్పు నియోజకవర్గ కన్వీనర్ పొట్టి శ్రీనివాస్ గుప్త ఆధ్వర్యంలో జోనల్, డివిజన్ ఇంచార్జీలు, డివిజన్, బూత్ అధ్యక్షుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రవికుమార్ మాట్లాడుతూ... తూర్పు నియోజకవర్గంలో లక్ష ఓట్ల మెజారిటీ సాధించేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సముద్రాల పరమేశ్వర్, డాక్టర్ వన్నాల వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, ఉపాధ్యక్షులు ఎరుకల రఘునారెడ్డి, కనుకుంట్ల రంజిత్ పాల్గొన్నారు.
- గిర్మాజిపేట: 26వ డివిజన్‌కు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం బీజేపీలో చేరారు. గిర్మాజిపేట బొడ్రాయి వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావుల సమక్షంలో డివిజన్ బీఆర్‌ఎస్ నాయకుడు కూచన క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో వడుప్సా జిల్లా నాయకుడు జ్ఞానేశ్వర్ సింగ్,పవన్, ప్రయివేట్ టీచర్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్, శ్రీనివాస్,వంశీ, డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు వంగరి కేశవ్, సామల శ్రీనివాస్, డాక్టర్ కె.హరిశంకర్, గిరిధర్, సుధాకర్‌తోపాటు సుమారు 100 మంది పార్టీ సభ్యత్వం స్వీకరించారు.

'వ్యాపారంలో డబ్బులు పెట్టించి మోసం'



తీర్మాన, అగ్రిమెంటు పత్రాలను చూపిస్తున్న సూర్యనారాయణ

గీసుగొండ, ఏప్రిల్ 21: రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తామంటూ నమ్మించి రూ.26 లక్షల పెట్టుబడి పెట్టించి, ఆ డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని, పైగా చంపుతామని బెదిరిస్తున్నారని ధర్మారంనకు చెందిన నాసం సూర్యనారాయణ వాపోయాడు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చి 2022లో ఊకల్‌లో ఎకరం కొనుగోలుకు తనతోపాటు కోట రేణుక, డోలి చిన్నిలతో కలిసి రూ.5లక్షలు ఇచ్చి అగ్రిమెం టు చేసుకున్నామన్నారు. అదే సర్వేనంబర్‌లోని మరో రెండు వేల గజాలకు కూడా రూ.5లక్షలు ఇచ్చి అగ్రిమెంటు చేసుకున్నామన్నారు. తర్వాత దశలవారిగా రూ.26లక్షలు పెట్టుబడి పెట్టానన్నారు. తనకు తెలియకుండానే కోట రేణుక పట్టా చేయించుకొని ప్లాట్లు అమ్ముకున్నారని, ఇదేమిటని ప్రశ్నిస్తే ఏమి చేస్తావో.. చేసుకో అంటు మొండికేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. ఈనెల 16న వారికి అనుకూలమైన పెద్ద మనుషులతో రూ.45 లక్షలు ఇచ్చేటట్లు తీర్మానించి దానికి గాను 840 గజాలు భూమి తీసుకోవాలని చెప్పారన్నారు. దానికి తాను ఒప్పుకోకుండా నగదు కావాలని కోరితే ఏం.. చేస్తావో చేసుకో...అంటూ చంపుతామని బెదిరిస్తున్నారన్నారు.

'కాంగ్రెస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్

గీసుగొండ, ఏప్రిల్ 21: మాదిగలంతా కలిసికట్టుగా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని టీపీసీసీ ప్రచార కమిటీ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ గాదె దయాకర్ అన్నారు. కొనాయిమాకులో ఏర్పాటు చేసిన పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ, బీఆర్‌ఎస్‌లు దళితులను మోసం చేసే పార్టీలేనన్నారు. 23న గీసుగొండలో నిర్వహించే దళిత ఆత్మగౌరవసభకు నియోజకవర్గంలోని మాదిగలంతా కదిలి రావాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి, నాయకులు దుపాకి సంతోష్, మాజీ ఎంపీపీ జన్ను మల్లయ్య, కేదాసి మోహన్, రాగారపు స్వామి, గొర్రె రాజు, కొమ్ము శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

- ధర్మారం గ్రామానికి చెందిన పలువురు బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన జిల్లా జాగృతి అధ్యక్షుడు పోలెబోయిన సాంబయ్య, ముదిరాజ్‌సంఘం అధ్యక్షుడు పోలెబోయిన సురేందర్, రజక సంఘం అధ్యక్షుడు గట్టికొప్పుల సదానందం, అనిల్, శ్రీను, నాగరాజులకు ఎమ్మెల్యే స్వగృహంలో ఆదివారం కండువాలను ఆహ్వానించారు.

నగదు స్వాధీనం

పరకాల, ఏప్రిల్ 21: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పరకాల పోలీసుల నిర్వహించిన వాహన తనిఖీల్లో సుమారు రూ. 2,08,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పరకాల పోలీసులు తెలిపారు. ఆదివారం పరకాల పట్టణంలోని ఎంఆర్ రెడ్డి కాలేజ్ సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా భూపాలపల్లి జిల్లా ఘనపూర్ మండలం గాంధీనగర్‌కు చెందిన రావుల అవినాష్ వద్ద రూ. 1,50,000, పెంట చిరంజీవి వద్ద రూ. 58700 లభించినట్లు పేర్కొన్నారు. పరకాల నుంచి ఘనపూర్ మండలానికి టాటా ఇంట్రాలో వెళుతుండగా తనిఖీ చేయగా ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు లభించడంతో సీజ్ చేసి మొత్తం రూ. 2,08,700 నగదును పరకాల ఏఆర్‌ఓకు అప్పగించినట్లు తెలిపారు.

ముసలమ్మకుంటలో వ్యక్తి అదృశ్యం



ఎం.రమేష్

వరంగల్ సిటీ, ఏప్రిల్ 21: ఏనుమాముల ముసలమ్మకుంటకు చెందిన మాడిశెట్టి రమేష్(49) మూడు రోజులుగా కనబడుట లేదని ఆయన భార్య మాడిశెట్టి వెంకటలక్ష్మి ఆదివారం ఏనుమాముల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం రమేష్ సెకండ్‌హ్యాండ్ లారీలను విక్రయిస్తూ జీవిస్తున్నాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో భార్యాభర్తలకు గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 19 భార్యతో గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఆదివారం అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఎస్ఐ శ్రీకాంత్ దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పులి రమేష్ తెలిపారు. రమేష్ ఆచూకీ తెలిసిన వారు 87126 85120, 87126 85133 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

దళితవాడలో తాగునీటికి తండ్లాట

మరమ్మతుకు నోచుకోని చేతిపంపులు

డ్రైనేజీలు అస్తవ్యస్తం

ఖిలావరంగల్, ఏప్రిల్ 21: ఖిలావరంగల్ 37వ, డివిజన్ దళితకాలనీలో తీవ్రమైన తాగునీటి ఎద్దడి ఏర్పడింది. చేతిపంపులు పనిచేయక, మినీస్టాటిక్ ట్యాంక్‌లు లేక ఇబ్బందిపడుతున్నారు. మిషన్ భగీరథ నీరు సైతం 5 రోజులకోసారి రాకపోవడంతో, తాగునీటికి అల్లాడుతున్నారు. దళితకాలనీలో సుమారు 300కుటుంబాలున్నాయి. ఎత్తైన ప్రాంతమైన మట్టికోట సమీపంలో గతంలో ఏర్పాటు చేసిన చేతి పంపులు పనిచేయడం కార్పొరేటర్, నగరపాలక సంస్థ సిబ్బందికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకునేవారు కరువయ్యారు. దళితకాలనీలో గతంలో వేసిన చేతిపంపులు మరమ్మతుకు నోచుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. గత కార్పొరేషన్, ఎమ్మెల్యే ఎన్నికలకు ముందు చేతి పంపుల స్థానంలో మినీ స్టాటిక్ ట్యాంక్ ఏర్పాటు చేస్తామని నాయకులు ఇచ్చిన హామీ ఇచ్చినా నెరవే రడం లేదని వాపోతున్నారు.





మరమ్మతుకు నోచుకోని చేతి పంపులు, ప్రమాదకరంగా మారిన ఇనుప విద్యుత్ పోల్



అస్తవ్యస్తంగా డ్రైనేజీ



ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు..

కాలనీలో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ఇనుప విద్యుత్ స్తంభాల పునాది సిమెంట్ దిమ్మెలు ఊడిపోయి, ఒక వైపునకు ఒరిగి ప్రమాదకరంగా మారాయి. వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. దళితకాలనీ లో సీసీ రోడ్లు, డ్రైయినేజీలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో గతంలో వేసిన మెటల్ రోడ్డును తవ్వి మిషన్‌భగీరథ పైపులను వేయడం వలనతో రోడ్డును మరమ్మతు చేయకపోవడంతో కాలనీలు గుంతమయంగా మారింది. తూర్పుకోట శివారు ప్రాంతంలో ముళ్లపొదలు, అస్తవ్యస్తమైన డ్రైయినేజీలతో మురికి నీరు రోడ్లపై పారుతోంది. ఇరుకు రోడ్లతో 108 వాహనం రాలేని పరిస్థితులు దాపురించాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

సీఐకి అభినందనలు

ఖిలావరంగల్, ఏప్రిల్ 21: ఇటీవల చింతల్ ప్రాంతానికి చెందిన నిరుపేద ముస్లిం కుటుంబానికి చెందిన బాధితుడి కబ్జాకు గురైన భూమిని వరంగల్ పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు న్యాయంగా బాధితుడికి అందించిన మిల్స్‌కాలనీ సీఐ వ ల్లయ్యను ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో అభినందించారు. కార్యక్రమంలో 34వ, డివిజన్ కాంగ్రెస్ నాయకులు చిట్టిమల్ల శ్రీనివాసరావు, కొనగంచి కృష్ణకుమారి, కోతి స్వరూప, బత్తుల రమేష్, సుధా పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL సోమవారం 22 ఏప్రిల్ 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

'బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగానికి ముప్పు'

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 21: పార్లమెంటు ఎన్నికల్లో మళ్లీ బీజేపీ గెలిచి మూడోసారి అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు వల్లందాసు కుమార్ ఆరోపించారు. ఆదివారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మనిషి మనిషిగా చూడలేని మనుధర్మ శాస్త్రాన్ని అంబేద్కర్ తగలబెట్టి భారత రాజ్యాంగం ద్వారానే ప్రజలకు మేలు జరుగుతుందని ఆశించాడని తెలిపారు. బీజేపీని మాదిగలు చిత్తుగా ఓడించాల్సిన అవసరంఉందని గుర్తుచేశారు. లేకుంటే బీజేపీ తిరిగి మనుధర్మ శాస్త్రాన్ని అందుబాటులోకి తెచ్చే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లెపాక చంద్రమౌళి, దుబ్బర సురేందర్, శేషునాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుమార్

కావ్య నామినేషన్ కార్యక్రమానికి తరలిరావాలి

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 21 : ఈ నెల 24న కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య నామినేషన్ వేసే కార్యక్రమానికి నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలని వరంగల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య కోరారు. ఆదివారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడియం కావ్య ఎంపీ అభ్యర్థిగా వేస్తున్న నామినేషన్ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లెపాక సమ్మయ్య, ఎల్లస్వామి, చెరుపెల్లి బాబు, ఎల్లయ్య పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశం

నర్సంపేట, ఏప్రిల్ 21 : రాబోయే పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని పట్టణంలోని ద్వారకపేట రోడ్‌లో గల ఎంఎఆర్ గార్డెన్‌లో ఈ నెల 22వ తేదిన ఉదయం 10 గంటలకు నర్సంపేట పట్టణ, మండల కార్యకర్తలు, నాయకులతో సన్నాహక సమావేశాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవిత ముఖ్యఅతిథిగా పాల్గొనే సన్నాహక సమావేశంలో మాజీ ప్రజా ప్రతినిధులు, మండల, గ్రామ కమిటీ బాధ్యులు, పార్టీ శ్రేణులు, నాయకులు పాల్గొనాలని ఆ పార్టీ నాయకులు కోరారు. అలాగే పట్టణంలోని జీఆర్ గార్డెన్‌లో మధ్యాహ్నం 12 గంటలకు చెన్నారావుపేట మండల కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తారు.

• నెక్కొండ : ఈ నెల 22వ తేదిన నెక్కొండ మండల కేంద్రం బీఆర్ఎస్ పార్టీ సమావేశం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు సంగని సూరయ్య ఆదివారం తెలిపారు. మండలంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యల్లో హాజరుకావాలని ఆయన కోరారు. నర్సంపేట రోడ్డులోని మహేశ్వర గార్డెన్‌లో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మోదీ పాలన కోసం సీతారాంనాయక్‌ను గెలిపించాలి

నెక్కొండ, ఏప్రిల్ 21 : భారతదేశంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాలన కోసం మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా బీజేపీ పార్టీకి చెందిన సీతారాంనాయక్‌ను గెలిపించాని కోరుతూ ఆదివారం బీజేపీ నాయకులు ఇంటింట ప్రచార కార్యక్రమాని చేపట్టారు. ప్రపంచ దేశాల ప్రజల మన్ననలను పొందుతున్న ప్రధాన మంత్రి మోదీ మరోసారి ప్రదానిగా గెలువడం ఖాయమన్నారు. దేశంలో పేద ప్రజల సంక్షేమం కోసం చేపడుతున్న పథకాల గురించి వివరించారు.కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, బూత్ అధ్యక్షుడు రాపాక సందీప్, నాయకులు తాళ్లరి లక్ష్మయ్య, అంబాల రాంగోపాల్, గూగులోతు షైబు, నరేష్ పాల్గొన్నారు.

బీజేపీ గెలుపు తథ్యం

రాయపర్తి, ఏప్రిల్ 21 : పార్లమెంటు ఎన్నికల్లో వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ గెలుపు తథ్యమని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు టీ. రాజేశ్వర్‌రావు తెలిపారు. ఆదివారం మండలంలోని మైలారంలో సీనియర్ నాయకులను కలిసి యోగాక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరంగల్ గడ్డపై మళ్లీ కాషాయ జెండా ఎగురబోతుందని ధీమా వ్యక్తంచేశారు. దేశంలో నరేంద్ర మోదీ పాలన పట్ల ప్రజలు సముచితంగా ఉన్నారని, అందుకే ఆయనను మూడోసారి ప్రధానిగా చేయాలని చూస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ దేశాలకు భారత దేశాన్ని ఆదర్శంగా చేసిన మోడీని మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

బీజేపీలో చేరికలు

నల్లబెల్లి, ఏప్రిల్ 21 : మండలంలో నల్లబెల్లి, రంగాపురం, ముచ్చింపుల గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ లకు సంబంధించిన యువకులు, నాయకులు సూమారు 30మంది ఆదివారం నియోజకవర్గ నాయకుడు రాణాప్రతాప్‌రెడ్డి సమక్షంలో మండల కేంద్రంలో బీజేపీలో చేరారు. అనంతరం వారికి బీజేపీ కండువాను కప్పి సాద రంగా పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీని గ్రామస్థాయిలో బలోపేతంచేస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పుల్లారావు, బొద్దిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, తడుక అశోక్, తడుక వినయ్, సుధాగాని ప్రమోద్ పాల్గొన్నారు.

నల్ల బెల్లం, పట్టిక పట్టివేత

నెక్కొండ, ఏప్రిల్ 21 : అక్రమంగా రవాణ చేస్తున్న ఒక క్వింటా నల్ల బెల్లం, 20 కిలోల పట్టికని నెక్కొండ రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం పోలీసులు పట్టుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. మహబూబాబాద్‌కు చెందిన భూక్య సోమ్లా మహారాష్ట్ర నుంచి అక్రమంగా మహబూబాబాద్‌కు తరలిస్తుండగా పట్టుకున్నారన్నారు. వీటి విలువ రూ. 40వేలు ఉంటుందని నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

కల్తీపై నిఘా కరువు



నర్సంపేటలోని ఓ బిర్యానీ సెంటర్‌లోని వంటగది



నర్సంపేటలో బ్రాండ్‌ల పేర్ల స్టిక్కర్లు లేని నూనె డబ్బాలు

నాణ్యతలేని నూనెలు, నిత్యావసర వస్తువులు

వరంగా మారిన అధికారుల అలసత్వం

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 21 : మనిషి జీవించడానికి అత్యంత అవసరమైన ఆహారాన్ని వ్యాపారులు తమ లాభాపేక్షకోసం నాణ్యతలేని నిత్యావసరవస్తువులతో తయారుచేసి విక్రయాలు జరుపుతుండడంతో రుచి పేరుతో వాటిని లొట్టలేసుకొని తింటున్న ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.ప్రజలకు పరిశుభ్రమైన ఆహారం అందేలా నిత్యం నిఘాపెట్టాల్సిన అధికారులు అలసత్వం ప్రదర్శిస్తుండడంతో కల్తీ వ్యాపారం నర్సంపేటలో జోరుగా కొనసాగుతోంది. ప్రజలు నిత్యంసంచరించే బస్టాండ్ సెంటర్లు, ప్రధాన కూడళ్లలోని ఫాస్ట్‌ఫుడ్‌సెంటర్లు, హోటళ్లు, పట్టణ శివారులోని దాబాలు, బిర్యానీ సెంటర్లు, బార్ అండ్ రెస్టారెంట్లలో వ్యాపారులు కనీస నిబంధనలు పాటించ కుండా ఇష్టారాజ్యంగా వంటకాలు చేస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు.

విచ్చలవిడిగా హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు

నర్సంపేటలో హోటల్ కల్చర్ పెరుగుతోంది. ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులతోపాటు రోజువారీ కూలీల వరకు వివిధ పనులపై బయటకు వెళ్లినప్పుడు అవసరాన్నిబట్టి టిఫిన్, భోజనం చేయడం కోసం హోటళ్లను ఆశ్ర యిస్తున్నారు. అంతేకాకుండా ఫాస్ట్‌ఫుడ్ తినేవారు ఎక్కు వవుతున్నారు. ప్రజల అవసరాలను, అభిరుచులను ఆసరాచేసుకొని విచ్చలవిడిగా ఎలాంటి అనుమతులు లేకుండానే హోటళ్లు, బిర్యానీ సెంటర్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో వ్యాపారులు కల్తీ వైపు మొగ్గు చూపుతున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిబంధనలకు విరుద్ధంగా రంగులను కలుపుతూ క్యాన్సర్, కాలేయ, గుండె జబ్బుల వంటి ప్రాణాంతకమైన రోగాలకు కారణమవుతున్నారు.

నాణ్యతలేని నూనెలు, నిత్యావసర వస్తువులు

అనేక హోటళ్లు, బిర్యానీ సెంటర్లలో ఎలాంటి బ్రాండ్ల పేరులేని, నాణ్యతలేని నూనెలు, కల్తీ నిత్యావసర సరుకులతో వంటలు చేయడంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. అపరిశుభ్రమైన వాతావరణంలో వంటలు తయారుచేయడంతో దోమలు, ఈగలు వంట కాలపై స్వైరవిహారం చేయడం వాటినే వినియోగదారులకు అందించడంతో రోగాలను కొనితెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. గత రెండు నెలల క్రితం నర్సంపేట పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఓ బిర్యానీ సెంటర్‌లో కుళ్లిన చికెన్ లభించడంతో కేసునమోదు చేసిన అధికారులు ఆ తర్వాత తనిఖీలు చేసిన పాపాన పోలేదు.

బార్ అండ్ రెస్టారెంట్లలో మరీ దారుణం...

బార్ అండ్ రెస్టారెంట్లలో వంటల తయారీ మరీ దారుణంగా ఉంటున్నదని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఫ్రిజ్‌లో రోజుల తరబడి నిల్వ చేసిన చికెన్, చేపలను తీసి వాటికి మసాల దినుసులతో వంట చేసి వినియోగదారులకు అందించడం జరుగుతుంది. బార్ అండ్ రెస్టారెంట్లపై ఫుడ్‌సేఫ్టీ అధికారులు కన్నెత్తి చూసిన పాపాన లేకపోవడం వ్యాపారుల ఇష్టారాజ్యంగా మారింది.



నర్సంపేటలోని ఓ ఫాస్ట్ ఫుడ్ సెంటర్

ఫిర్యాదు చేస్తేనే ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

ఫుడ్‌సేఫ్టీ విభాగం విధించిన నిబంధనలకు లోబడే హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార పదార్థాలతో వంటలు తయారు చేయాల్సి ఉంది. ప్రతీ వంటకానికి నూనె మార్చాలి. సింగిల్ యూజ్ విధానాన్ని అవలంబించాలి. రెండు రోజులకు మించి నిల్వ ఉన్న మాంసాన్ని వాడకూడదని, తదితర నిబంధనలు ఉన్నప్పటికీ చాలా మంది వ్యాపారులు పాటించడం లేదు. ఎక్కడైనా కల్తీ జరిగిందని ప్రజలు ఫిర్యాదు చేస్తే ఫుడ్‌సేఫ్టీ అధికారులు రావడం జరుగుతుంది. ఒకటి, రెండు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రజారోగ్యం కాపాడడానికి ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని వినియోగదారుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

'కేసీఆర్ సీఎం కానందుకు బాధపడుతున్నారు'

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 21 : మార్పు రావాలంటూ కాంగ్రెస్ చేసిన దుష్ప్రచారాన్ని నమ్మి మోసపోయామని, కేసీఆర్ సీఎం కానందుకు బాధపడుతున్నామని ప్రజలు చెపుతున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు.ఆదివారం పట్టణంలోని భారతీయ నాటక కళాసమితి ప్రాంగణంలో వరంగల్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు ప్రభుత్వ రాబడి తగ్గిపోతోందని, కేసీఆర్ ఉన్నప్పుడు ఉన్న భూముల విలువ ఈ ప్రభుత్వం రాగానే అమాంతం పడిపోయిందని ఆరోపించారు. మనం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టని ఎన్నో పథకాలు అమలుచేశామని, కానీ, కాంగ్రెస్ మాత్రం మేనిఫెస్టోలో పెట్టిన వాటిని అమలుచేసే పరిస్థితి లేదన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలే కాంగ్రెస్ పార్టీకి బుద్ధిచెపుతారని తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న వాటిని పరిష్కారంచేస్తానని హామీఇచ్చారు. పార్టీ కోసం పనిచేస్తున్న వారికి భవిష్యత్తులో మంచి రోజులువస్తాయని, ఎవరు అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, మండల పార్టీ అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, మాజీ ఆత్మ చైర్మన్ గుజ్జ గోపాల్‌రావు, వైస్ చైర్మన్ కోమాండ్ల ఎలేందర్ రెడ్డి, కౌన్సిలర్ తోటకూరి రాజమణి, కొండేటి శ్రీనివాస్, సంపత్, నాగార్జున్ తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేటలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

• **రాష్ట్రంలో కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి లేదు**

రాయపర్తి : ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలోలేరని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు వరంగల్ కలెక్టర్ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మారపెల్లి సుధీర్‌కుమార్ నామినేషన్ వేయ నున్నారని ఈ కార్యక్రమానికి మండలం నుంచి భారీఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని సూచించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీకే పట్టం కడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో మండల పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి గుడిపూడి గోపాల్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు మునావత్ నర్సింహనాయక్, ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి, జడ్పీటీసీ రంగుకుమార్, జిల్లా నాయకులు బిల్లా సుధీర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జక్కుల వెంకట్‌రెడ్డి, పూస మధు, ఎండీ నయీం, ముత్తడి సాగర్‌రెడ్డి, చెవ్వ కాశీనాథం పాల్గొన్నారు.

గం'జాయ్'!

(5వ పేజీ తరువాయి)

తాగుతూ మత్తులో విహరిస్తున్నారని సమాచారం. దీంతో చాలా చోట్ల మత్తులో యువత రచ్చ రచ్చ చేసిన సంఘటనలు ఉన్నాయి.గత మార్చి 25వ తేదీన వరంగల్ శంభునిపేట ప్రాంతంలో గంజాయి మత్తులో ఓ బాలుడు నడుచుకుంటూ వెళుతున్న బాలికను ఈవ్‌టీజింగ్ చేస్తూ వేధించిన ఘటన కలకలం రేపింది. హనుమకొండ పోచమ్మకుంట ప్రాంతంలో మత్తులో స్థానికులపై కత్తితో దాడికి పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. ఇలా అనేక ప్రాంతాల్లో గంజాయి మత్తులో యువత వీరంగం సృష్టిస్తుంది. ఎన్నికల వేళ కావడంతో ఇది శాంతిభద్రతలకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ఈ ప్రాంతాల్లోనే మత్తెక్కేది..!

పల్లె, పట్నం తేడా లేకుండా ఇటీవల కాలంలో గంజాయి అమ్మకాలు విచ్చలవిడిగాసాగుతున్నాయి.పోలీసు యంత్రాంగం ఎన్నికల విధుల్లో ఉండడంతో స్మగ్లర్లకు పండుగ అవుతుందనే టాక్ వినబడుతోంది. ప్రధానంగా వరంగల్ మహానగరంలో ఎక్కువగా గొర్రెకుంట శివారు, కీర్తినగర్ కాలనీ, కోటిలింగాల గుడి రోడ్డులో గంజాయి సేవించే అడ్డాలుగా భావిస్తున్నారు. అలాగే కాశిబుగ్గ ఓసిటీ గ్రౌండ్, కొత్తవాడ కెనాల్ దారి, ఎల్‌బీనగర్, ఖిలావరంగల్ తూర్పు కోట ప్రాంతం, చింతల్ బ్రిడ్జి, శివనగర్ రైల్వే స్టేషన్ వైపు, సీకేఎం కాలేజీ మైదానం, చిన్నవడ్డెపల్లి చెరువు కట్ట, మండిబజార్ సమీపంలోని ఏరియా, ఇస్లామియా కాలేజీ గ్రౌండ్, రంగంపేట రోడ్డు, మ్యూజికల్ గార్డెన్, ఎనుమాముల మార్కెట్ వంద ఫీట్ల రోడ్డు, హనుమకొండ కుమార్‌పల్లి మార్కెట్, డబ్బాలు, ఆర్టీసీ బస్టాండ్, పద్మాక్షి ఆలయం ఏరియా రోడ్డు, యూనివర్సిటీ క్రాస్ రోడ్డు, పోచమ్మకుంట ప్రాంతం, నయీంనగర్, వడ్డెపల్లి, వందఫీట్ల రోడ్డు, హంటర్‌రోడ్డు, ఖమ్మం బైపాస్ రోడ్డు, కాజీపేట రైల్వే జంక్షన్, మడికొండ తదితర ప్రాంతాల్లో విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు, మత్తు పీల్చేందుకు అడ్డాలుగా ఉన్నట్లుగా ప్రచారంజరుగుతోంది. వీటితో పాటు భూపాలపల్లి జిల్లాకేంద్రంలో సింగరేణి పిల్లలే లక్ష్యంగా గంజాయి ముఠా జోరుగా అమ్మకాలు చేస్తున్నట్లుగా సమాచారం. మహారాష్ట్ర నుంచి గంజాయి ముఠా భూపాలపల్లి పట్టణంలోని కృష్ణకాలనీ, సుభాష్‌కాలనీ, యాదవ్‌నగర్, కేటీకే 5వ గని ఏరియా చెట్ల పొదలు, సింగరేణి థౌజెండ్ క్వార్టర్స్ ఏరియా, మెడికల్ కాలేజీ రోడ్డు తదితర ప్రాంతాల్లో గంజాయి గుప్పుమంటున్నా పట్టించుకునే వారు కరువయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మహబూబాబాద్ పట్టణంలోని రైల్వే స్టేషన్ ఏరియా, నెహ్రూ సెంటర్, మార్కెట్, డోర్నకల్, కేసముద్రం, నెక్కొండ, స్టేషన్ ఘనపూర్, జనగామ తదితర రైల్వేస్టేషన్లు, ఇతర ప్రాంతాల ద్వారా గంజాయి మత్తు పల్లెలకు కూడా చేరుకుంటుందనే ప్రచారం జరుగుతోంది.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

పర్వతగిరి, ఏప్రిల్ 21 : బీఆర్ఎస్ పార్టీ నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు ఆదివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రోళ్లకల్లు, నారాయణపురం నుంచి బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎర్రబెల్లి వెంకటేశ్వర్‌రావు, గ్రామ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు బొమ్మెర ఏకాంతం, జమాల్‌పురానికి చెందిన ఐనవోలు దేవస్థాన మాజీడైరెక్టర్ బండి సాయిలు, బండి సారయ్య, దుడ్డు నాగరాజు, పిడుగు రమేష్‌లకు ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వరంగల్ పార్లమెంటు అభ్యర్థి కడియం కావ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

కంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న గౌడకులస్తులు

పర్వతగిరి, ఏప్రిల్ 21 : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కంఠమహేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో కంఠమహేశ్వరస్వామి, సురమాంబ, వనం ఎల్లమ్మ, వనం మైసమ్మల విగ్రహాలను మంత్రోచ్చారణల మధ్య ప్రతిష్ఠించారు. మహిళలు భారీ ఎత్తున మంగళ హారతులతో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం గౌడ కులస్తులు తమ ఇళ్ల నుంచి జలబిందెలతో ఆలయానికి తరలివెళ్లి అభిషేకాలు నిర్వహించారు. సోమవారం స్వామివారికి బోనాలు సమర్పించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తీగల వీరస్వామిగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడసంఘం అధ్యక్షుడు పుల్లూరి సారయ్యగౌడ్, గౌరవ అధ్యక్షులు రంగు జనార్ధన్‌గౌడ్, రంగు కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షులు దయాకర్‌గౌడ్, శ్రవణ్‌గౌడ్, సభ్యులు మడ్డి వెంకన్న, చిర్ర శేఖర్, రంజిత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

• **వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే**

కంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలకు ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయాల నిర్మాణం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కమిటీ బాధ్యులు ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనీల్‌రావు, మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్,ఎంపీటీసీ బొట్ల మహేంద్ర, సొసైటీ డైరెక్టర్ గంగాధర్‌రావు, నాయకులు భాస్కర్, రాంచందర్, సునీల్‌రావు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

కంకర పోశారు... బీటీ మరిచారు

దుగ్గొండి, ఏప్రిల్ 21 : మట్టి రహదారులకు ఆర్ ఆర్ఎం గ్రాంట్ కింద బీటీ రోడ్లు మంజూరీ కాగా, రోడ్లపై కంకరపోసి బీటీ పోయడం మరచిపోవడంతో రహదారులపై ప్రయాణించ డానికి ప్రజలు, వాహనదారులు, రైతులు నరక యాతనతోపాటు పశువులు అవస్థలు పడుతు న్నాయి. కంకర పోసి నెల లు గడుస్తున్నప్పటికీ నిర్మాణానికి నోచుకోకపోవడంతో వివిధ గ్రామ స్థులు ఆవేదన వ్యక్త పరుస్తున్నారు. మండలంలోని రేకంపల్లి నుంచి తిమ్మంపేట, చలపర్తి నుంచి కాలనీ వరకు, వెంకటాపురం నుంచి మహ్మదాపురం, గోపాలపురం నుంచి గొల్లపల్లి వరకు ఉన్న రోడ్లకు బీటీ రోడ్లు మంజూరయ్యాయి. ఆ రోడ్లపై కంకరపోసి సుమారుగా ఎనిమిది నెలలు గడుస్తోంది.



రేకంపల్లి నుంచి తిమ్మంపేట రహదారిపై పోసిన కంకర

రైతులు, పశువులు ప్రయాణానికి...

బీటీ రోడ్లు మంజూరైన రహదారులు ఎక్కు వగా రైతులకు ఉపయోగకరంగా ఉంటాయి. ప్రతీ నిత్యం ఆ రోడ్లపై రైతులు ఎడ్ల బండ్లతో పాటు వ్యవసాయం కోసం ప్రయాణిస్తుంటారు. వ్యవసాయానికి తరలిస్తున్న పశువులకు కంకర కారణంగా కాళ్లకు రక్తాలు వస్తున్నట్లు రైతులు తెలుపుతున్నారు. కూలీలు సైతం పనులకు వెళ్లడానికి ఇష్టపడడంలేదు. దీంతో రైతుల వ్యవసాయ పను లకు ఇబ్బంది కలుగుతుందని అంటున్నారు. నరకయాతన రోడ్ల నుంచి విముక్తి ఎపుడు కలుగుతుందని పలువురు ఆవేదన వ్యక్త పరుస్తున్నారు. అధికారులు స్పందించి బీటీ పోయాలని కోరుతున్నారు.



రేకంపల్లి నుంచి తిమ్మంపేట రహదారిపై పోసిన కంకర

ప్రారంభించిన పనులు చేయాలని నిరసనలు

ఇటీవల మండలంలోని దేశాయిపల్లిలో బీఆర్ఎస్ నాయకులు ప్రారంభించిన పనులు చేపట్టాలని నిరసనలు తెలిపారు. మంజూరైన రోడ్లతో పాటు కంకరపోసిన రోడ్ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. సంబంధిత కంట్రాక్టర్లతో పనులు చేపట్టి ప్రజల అవస్థలు తీర్చాలని కోరారు.

కంకరపోసిన రోడ్డుతో నరకయాతన పడుతున్నాం..

దొనపాటి రవీందర్‌రెడ్డి, రైతు, తిమ్మంపేట



తిమ్మంపేట నుంచి రేకంపల్లి వరకు రోడ్డుకు కంకరపోయడంతో కంకరపై నడవడానికి నరక యాతన పడుతున్నాము. ఆ రోడ్డు నుంచి కనీసం రోజుకు నాలుగుసార్లు వ్యవసాయ పనులకోసం వెళుతాను. వ్యవసాయానికి తీసుకుపోతున్న పశువులు సైతం నడువడం కష్టంగా ఉంది. అధికారుల జోక్యం చేసుకొని కంకరపై బీటీ పోసి రైతుల అవస్థలు తీర్చాలి.

ట్రాన్స్ కో... జర మేలుకో..!

ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ వలయాలు కరువు

ప్రమాదాలకు నిలయంగా డీటీఆర్‌లు

విద్యుత్ షాక్‌తో మూగజీవాలు మృతి

పట్టించుకోని అధికారులు

రాయపర్తి, ఏప్రిల్ 21 : మండలంలోని పలు గ్రామాల్లో, గిరిజన తండాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ వలయాలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వ్యవసాయ క్షేత్రాలే కాకుండా జనావాసాల మధ్య ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు సైతం ఫెన్సింగ్ లేక ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. ఆదమరచి దగ్గరగా వెళితే ప్రాణాలకే ముప్పు పొంచి ఉండడంతో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. త్రిఫేస్ సరఫరా అయ్యే డీటీఆర్‌లకు సైతం ఫెన్సింగ్ లేకపోవడంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ఏబీ స్విచ్‌లను కొంతమంది ఇష్టారీతిన వేయడం, బంద్ చేయడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

మండలంలో ఇలా...

మండల కేంద్రంతో పాటు మండలంలోని మైలారం, పెర్కవేడు, కొత్తూరు, గట్టికల్లు, ఏకేతండా, కొండూరు, కేశవపురం, సన్నూరు, సూర్యతండా, గన్నాం, కొండూరు, గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ వలయాలు లేక మూగజీవాలు మృత్యువాత పడిన సంఘటన ఎన్నో ఉన్నాయి. ఘటనలు జరిగిన డీటీఆర్‌ల చోట సైతం అధికారులు పరిశీలించి పరిష్కార చర్యలు చూపకపోవడంతో మళ్లీ ఎప్పుడు ప్రమాదం జరుగుతోందనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని పలు తండాల్లో పలుమార్లు విద్యుత్ వైర్లు తెగిపడిన ఘటనలు ఉన్నాయి. నాణ్యతలేని ఏబీ స్విచ్‌లు, ఫీజులు ఏర్పాటు చేయడం వలన లోడ్ ఎక్కువగా ఉన్నప్పుడు ఫీజులు పేలి భారీ శబ్దాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.



సూర్యతండాలో విద్యుత్ షాక్‌తో మృతిచెందిన పాడి గేదే (ఫైల్)

మచ్చుకు కొన్ని...


మండలంలోని మైలారం గ్రామంలో జాతీర రహదారి పక్కనే జన నివాసాల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను గతంలో వాహనం అదుపు తప్పి దగ్గరకు వెళ్లి ఆగింది. పెర్కవేడులో సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ కింద ఎర్త్ వైరుకు విద్యుత్ సరఫరా తగిలి రెండు పాడి గేదేలు మృతిచెందాయి. దాని యజమానికి సైతం షాక్ తగిలి అపస్మారక స్థితికి చేరుకుని, ప్రాణాలతో బయటపడ్డాడు. కొండాపురం, గట్టికల్లు గ్రామాల్లో ఫీజులు పోవడం వలన భారీ శబ్దాలు వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ కేంద్రాల మాదిరిగా గ్రామీణ ప్రాంతాల్లోని జనావాసాల నడుమ ఉండే డీటీఆర్ చుట్టూ రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



మైలారంలో జాతీయ రహదారి ఇంటి సమీపంలో రక్షణ వలయం లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

రక్షణ వలయాలు నిర్మించాలి..

రమావత్ జగన్, రైతు, సూర్యతండా



ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణవలయాలు నిర్మించాలి. వేసవిలో మూగజీవాలు విచ్చలవిడిగా తిరిగి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. రక్షణ వలయాల ద్వారా ప్రమాదాలు జరగకుండా కాపాడుకోవచ్చు. వెంటనే అధికారులు స్పందించి ఏర్పాటు చేయాలి.

డీటీఆర్‌లకు ఎత్తుగా గద్దెలను నిర్మిస్తున్నాం...

తరుణ్, విద్యుత్ శాఖ ఏఈ, రాయపర్తి

ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినప్పుడే గద్దెలను ఎత్తుగా నిర్మిస్తు న్నాం. గతంలో నిర్మించిన వాటిపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం. మూగ జీవాలకు అందకుండా చేసే విధంగా చర్యలు చేపడతాం. ప్రమాదాలు జరిగే వాటిని గుర్తించి పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటాం.